KSR02B107 C

ENTERED

వెండితెర జల గండాలు



ప్రజాశక్తి

ఆదివారం అనుబంధం

ఫిబ్రవరి 07, 2016

ఇంటిపై పంట





బయోపిక్ బాలీవుడ్

బాలీవుడ్‌కు 2016 బయోపిక్ నామ సంవత్సరం. డర్టీ పిక్చర్, బాగ్ మిల్కా బాగ్, మేరీ కోమ్, మాంజీ, బాజీరావ్ మస్తానీ లాంటి హిట్లతో ఊపు మీదున్న బాలీవుడ్ జీవిత గాథల మీద మరిన్ని చిత్రాల్ని తెరకెక్కించే పనిలో పడింది. జనవరిలోనే విడుదలై రికార్డులతోపాటు రివార్డులు పొందుతోన్న అక్షయ్ కుమార్ 'ఎయిర్ లిఫ్ట్' కూడా బయోపిక్ కోవలోదే.

1986లో కరాచీలో హైజాక్‌కు గురైన పాన్ యామ్ విమాన ఫ్లైట్ అటెండెంట్ నీర్జా బానోత్ సాహస గాథను 'నీర్జా'గా రామ్ మాద్వానీ తెరకెక్కిస్తున్నారు. మంగళ్ పాండే తర్వాత ఆమీర్ ఖాన్ మళ్లీ 'దంగాల్' పేరిట మల్ల యోధుడు మహావీర్ సింగ్ ఫోగట్ నిజ జీవిత కథతో ముందుకు వస్తున్నాడు. ఒకప్పటి మేటి కెప్టెన్ అజారుద్దీన్ పాత్రలో ఎమ్రాన్ హష్మీ 'అజార్' చిత్రం, నేటి కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనిపై నీరజ్ పాండే దర్శకత్వంలో 'ధోనీ: ది అన్ టోల్డ్ స్టోరీ' రాబోతోంది. 'రాయీస్'లో షారుక్ ఖాన్‌ది గుజరాత్ డాన్ అబ్దుల్ లతీఫ్ షేక్ పాత్ర అంటున్నారు. మరో డాన్ దావుద్ ఇబ్రహీం అక్క హసీనాపై అపూర్వ లాఖియా ఓ చిత్రం చేస్తున్నారు. ఒకప్పటి గ్యాంగ్‌స్టర్ అరుణ్ గౌలి పాత్రలో అర్జున్ రామ్‌పాల్ 'డాడీ' చిత్రంలో కనిపించనున్నాడు. అలీగఢ్ వివాదాస్పద ప్రొఫెసర్ శ్రీనివాస్ రామచంద్ర సిరాస్ పాత్రలో మనోజ్ బాజ్‌పేయ్‌తో 'అలీగఢ్' పేరిట చిత్రం రూపొందించారు. పాకిస్తాన్ జైల్లో అమరుడైన భారతీయ ఖైదీ సరబ్‌జిత్ కథ ఆధారంగా వస్తున్న 'సరబ్‌జిత్'లో ఐశ్వర్య రాయ్ సరబ్‌జిత్ చెల్లెలు దల్బీర్ కౌర్‌గా, రణ్‌దీప్ హుడా సరబ్‌జిత్‌గా నటిస్తున్నారు. కంగనా రనౌత్ కవయిత్రి అమృత ప్రీతమ్ పాత్రలో శేఖర్ కపూర్ చిత్రం చేయనుంది. ●



ENTERED KSR02B107
కథా నిలయం

ఇండెక్స్

ఆదర్శగ్రామం..........2
భళారే.. హివారే..
మార్గదర్శి..........3
ఆమె జీవితం
క్యాన్సర్ రోగులకే అంకితం
స్టార్..................4
వాలీబాల్ పులి
కార్టూన్ పంచ్.........5
యువ................10
లేడీ ఐన్‌స్టీన్
సందర్భం.............11
రేడియో కబుర్లు

ఇంటి పై పంట

అట్టమీది కథ.........6

హాలీవుడ్....12
వెండితెర జలగండాలు

నా కళ్ళతో...............14
ఓ ప్రయాణం మిగిలే ఉంది !
వింతలోకం..............16
పెంగ్విన్ ప్రేమ
కవిత్వమ్..................17
భాష్పాంజలి
కథ.......................18
ప్రతిఘటన
రుచి.....................21
అటుకుల పులిహోర
బాలనేస్తాలు.............22
పెన్‌స్టాండ్ చేద్దామా

మట్టిలో మాణిక్యం

ఆర్టిస్ట్ జూలియన్ మల్లాండ్ పారిస్ గోడలపై గీచిన చిట్టిపాపల బొమ్మలు.. బెంగాల్‌లో బహురూపులు .... వీధుల్లో వారి ప్రదర్శనలు... ప్రకృతి సంపదకు నిలయమైన కోహిమా అందాలు గాఢంగా హత్తుకున్నాయి. ఆషికి హీరోయిన్ అను అగర్వాల్ సినీ బయోగ్రఫీ బాగా బాధించింది. చీఫ్ మేజిస్ట్రేట్ ప్రమాణోత్సవానికి రాష్ట్రపతి నుంచి ఆహ్వానం అందుకున హిజ్రా కల్కి, మధ్య ప్రదేశ్‌లోని ఓ గ్రామంలో సర్పంచిగా ఒక మహిళను ఎన్నుకోవడాలు వంటివి యువతకు మార్గదర్శకం.

-టి. సత్యనారాయణ మూర్తి, విశాఖ

తరం మారింది

నాటి తరాన్ని తీర్చిదిద్దిన కథలను నేటితరం అందుకోలేకపోతోంది. దాన్ని ఎవరు ఎలా సొమ్ము చేసుకుంటున్నారో, రాజకీయ నాయకులు వేదికలెక్కి కొత్తగా చెబుతున్న కథా కమామీషుల గురించి 'కథల కార్ఖానా'లో చక్కగా వివరించారు. సాధారణ గృహిణి నుంచి గ్రామ పెద్దగా ఎదిగిన వందనా బహదూర్ జీవిత గమనం నేటి మహిళలకూ ఆదర్శంగా నిలుస్తుంది. పిల్లల మెదడుకు పదును పెట్టే

పజిల్ విశేషాలు ఆసక్తి కరంగా ఉన్నాయి. జీవితంలో ఎన్ని ఒడిదొడుకులు ఎదురైనా బ్యాలెన్స్‌గా ఉండాలని అను అగర్వాల్ జీవిత పాఠాలు నేర్పాయి. స్టార్ ద్వారా తన జీవిత ఒడిదొడుకులను తెలుసుకోగలిగాం. తరం మారింది కథ బావుంది. ఎగ్ వంటకాలు, అనంతంలో అంతా... బెంగాలీ బహురూపుల గురించి చెప్పిన విషయాలు చక్కగా వున్నాయి.

-శ్రీనివాస్, ఒంగోలు

అలుపెరుగని పోరాటం

తనకంటూ ఓ గుర్తింపు పొందాలనే తపనతో అవయవ వైకల్యాన్ని కూడా అధిగమించి వీరేంద్ర సింగ్ తపన, అంతర్జాతీయ వేదికల్లో గూంగా పెహల్వాన్‌గా మారి తన సొంత గ్రామానికి దేశానికి పేరుతీసుకు రావాలన్న అతని పట్టు బిగవాలని కోరుకుంటున్నా. అనంతంలో అంతా చిత్రాలు, బెంగాలీ బహురూపుల జీవితాల గురించి తెలుసుకోగలిగాం. తమకూ ఈ సమాజంలో సరైన గుర్తింపు రావాలంటూ హిజ్రాలు చేస్తున్న పోరాటంలో కల్కి ఓ మైలు రాయి. ట్రాన్స్ జెండర్ సమస్యలు, వారి భావోద్వేగాలను యువ ద్వారా అందరికీ పరిచయం చేసిన తీరు బాగుంది. అల్జీమర్స్ వ్యాధి బారిన పడకుండా కాపాడే పజిల్ విషయాలు ఆద్యంతం ఆసక్తికరంగా వున్నాయి.

-విద్యా సాగర్, కర్నూలు

మార్పు తెస్తున్నాయి

ఇల్లు చక్కబెట్టమే కాదు తమ గ్రామాన్నీ చక్కబెట్టగలరని రుజువు చేసింది వందన. కార్టూన్ పంచ్‌లు బాగున్నాయి. కోహిమాను 'చూద్దామా' చాలా దగ్గరగా చూపించారు. నిండైన వస్త్రధారణ, తొణికిసలాడే చిరునవ్వుతో ఉన్న రాజసులోచన విశేషాలు చదువుతుంటే తన సినిమాలు మళ్ళీ చూడాలనిపించింది. తరం మారింది కథ బాగుంది. 'అనంతంలో అంతా' జూలియన్ గ్రాఫిటీలు బాగున్నాయి. ఏడాదికోసారి వచ్చే పండుగలు, ఉత్సవాలను ప్రతిబింబించేలా వివిధ కళారూపాలను బెంగాలి బహురూపులు ప్రదర్శిస్తూ ఇప్పటికీ ఆ కళలను పోషించడం సంతోషం. జీవితంలో బ్యాలెన్స్ తప్పితే ముప్పే అని తను తీసుకున్న మంచి నిర్ణయాల గురించి చెప్పిన అను అగర్వాల్ జీవిత కథనం బాగుంది.

బొడ్డేపల్లి కనకలక్ష్మి, ఆమదాలవలస.

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com





హివారే బజార్ గ్రామం గురించి వింటే అసూయ పుడుతుంది. దేశంలోనే ఆదర్శవంతమైన, ఉత్తమమైన గ్రామంగా పేరే కాదు! ఆ ఊరిలో గడప గడపకు ఐశ్వర్యం అంటి పెట్టుకుంది. ప్రతి ఇంటి ఆదాయపు లెక్కల్లోనే కాదు! ఉన్న 235 కుటుంబాల్లో 60 కుటుంబాలు కోటీశ్వరులవే. అదీ కేవలం వ్యవసాయంపై అంత సంపాదించారంటే నమ్మ బుద్ధి కాదు. ఒకప్పుడు కరువుతో అల్లాడి గ్రామమంతా దాదాపు ఖాళీ అయిన హివారే బజార్ విజయ గాథ ప్రతి గ్రామాన్ని చేరితే గ్రామ స్వరాజ్యపు విప్లవమే పుట్టుకొస్తుంది.

భళారే... హివారే..

అది 1970ల సంగతి. మహారాష్ట్ర అహ్మద్‌నగర్ జిల్లాలోని మారుమూల గ్రామం హివారే బజార్. 1972 నాటి కరువు దెబ్బకు ... అదేదో జబ్బు చేసినట్టు గ్రామమంతా ప్రాణం జాడ లేదు. అప్పటికే 90 శాతం ఊరు వలసపోయింది. మట్టి మీద మమకారం చంపుకోలేక అక్కడే మిగిలిపోయిన వారికి రెక్కలాడేందుకు ఏ పనీ లేదు. ఊరి దుస్థితితో మనసు పాడు చేసుకున్న రైతన్నలు సారాయికి బానిసలయ్యారు. మరింత కుదేలయ్యాయి కుటుంబాలు. మిగతా ఊరు కూడా పట్నానికి తుడుచి పెట్టుకుపోవడానికి చద్దిమూట కట్టుకుంది. 1990 కల్లా కరువు సీమలో నెగళ్లు.. ఉన్న ప్రాణాన్ని తీసేందుకు సిద్ధమయ్యాయి. సారా మత్తులో, ఆకలి పొట్టలతో చిన్న విషయాలకు పెద్ద గొడవలే జరిగేవి. గ్రామంలో రోజురోజుకీ దిగజారుతున్న పరిస్థితులు కొందరు యువకుల్ని ఆలోచింపజేశాయి. ఊరి పెద్దే సర్పంచ్‌గా ఉన్నా ఏమీ చేయలేని పరిస్థితి.

అలాంటి ఊరిలో పోపట్ రావ్ పవార్ అనే కుర్రాడు డిగ్రీ పూర్తిచేసుకున్నాడు. 1989లో పట్టా వచ్చాక మిగతా అందరి లానే ఉన్నత జీవితం కోసం పట్నానికి సామాను సర్దుకున్నాడు. ఈ విషయం మిగతా యువకులకు తెలిసి పోపట్‌రావ్‌ను గ్రామం వదిలి వెళ్లకుండా అడ్డుకున్నారు. గ్రామ పెద్దల అశక్తతను ఏకరువు పెట్టి సర్పంచ్‌గా నిలబడమని బుజ్జగించారు. తొలుత పోపట్‌రావ్‌కు ఇష్టం లేకపోయినా ఊరి బాగు కోసం ... తనకు వచ్చిన ఉన్నతోద్యోగాన్ని కాదనుకున్నాడు. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యాక ఊరిని పీడించేది కేవలం కరువే కాదు... సారాయి కూడా అని గమనించాడు. అదే విషయం పెద్దలకు, గ్రామస్తులకు చెప్పి సారాయి బట్టీల్ని, 22 దుకాణాల్ని మూసివేయాలని లేకుంటే తాను తన దారి చూసుకుని పట్నానికి పోతానని తెగేసి చెప్పాడు. చాలా బలవంతంగానే గ్రామస్తులు సారాయికి దూరమయ్యారు. ఆ ఒక్క వ్యసనం వదలడంతో... బోలెడు కాలం కలిసొచ్చింది. ఏ పని చేయాలో తోచక పోపట్‌రావ్ చుట్టూనే తిరిగేవారు. శ్రమదానంతో వారికి మత్తు పూర్తిగా వదిలింది.

ఒక్కో బొట్టూ ఒడిసి పట్టి..

జల కళ లేని ఆ ప్రాంతంలో వందల ఎకరాల భూములు ఎడారిగా మారిపోతున్నాయి. వాటిని అలా వదిలేస్తే ఉన్న కాస్త సారం పోతుందని తెలుసుకుని ఆ భూముల్లో కొన్నింటిని చెరువులుగా మలచాలని నిర్ణయించాడు. గ్రామస్తులంతా ఐక్యంగా కదిలి పనులు చేపడితేనే ఖర్చు లేకుండా పటిష్టంగా చెరువుల్ని నిర్మించొచ్చని వివరించాడు. దాహార్తితో ఉన్న గ్రామమంతా కదిలింది. ఒక్కొక్కటిగా 52 మట్టి, 32 రాతి, 2 సీపేజ్ చెరువుల్ని నిర్మించుకున్నారు. సొంతగా 9 చెక్ డ్యామ్‌ల్ని కట్టుకున్నారు. వీటికి తోడు రక్షిత వర్షపు నీటి ఏర్పాట్లను ఇంటింటా పెట్టుకున్నారు. అక్కడ ఏడాదికి సగటు వర్షపాతం కేవలం 15 అంగుళాలే. కానీ ఎక్కడికక్కడ దోసిలి పట్టిన చెరువులతో గ్రామంలో మళ్లీ జల కళ కనిపించింది. ఏర్పాట్లు చేసుకున్న తర్వాత ఒక్క వర్షాకాలంలోనే నీటి పారుదలున్న భూభాగం 50 నుంచి 170 ఎకరాలకు విస్తరించింది. భూజల మట్టమూ పెరిగేలా జాగ్రత్తలు తీసుకోవడంతో బావుల్లో కూడా చెమ్మ చేరింది. ఇదే పెద్ద మార్పు చేకూర్చింది. సాగు మళ్లీ మొదలైంది. పోపట్‌రావ్ బ్యాంకు అధికారులు, జిల్లా అధికారుల్ని ఒప్పించి వ్యవసాయ రుణాలు వచ్చేలా చేశాడు. 100 రకాల వంగడాలు, జాతుల మొక్కల్ని ఎంచుకుని ఓ పెద్ద సామూహిక సాగును చేపట్టారు. భవిష్యత్తులో ఏదైనా ఇబ్బందులు తలెత్తితే ఇది ఉపయోగపడుతుందని సాలోచన. ఇదనే కాదు. ఇరుగు పొరుగు రైతన్నలు కలిసి పొలం పనులు చేసుకునే సామూహిక సేద్య పద్ధతిని ప్రవేశపెట్టాడు. ఎప్పటికప్పుడు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల వివరాలు తెలుసుకుంటూ అధిక ధరల తాకిడి నుంచి బయటపడేలా చేశాడు. పదేళ్ల క్రితం రోజుకు గ్రామ పాల ఉత్పత్తి 150 లీటర్లుంటే ఇప్పుడు 5 వేల లీటర్ల వరకు చేరుకుంది. గ్రామ యువత కూడా చదువు గొప్పదనాన్ని గుర్తించి విద్యావంతులై తమ వంతుగా గ్రామోన్నతికి పాటు పడ్డారు. మద్యపానమే కాదు ధూమ పానం, మత్తు తీసుకోవడంపై కూడా నిషేధం కచ్చితంగా అమలయ్యేలా దశాలు ఏర్పడ్డాయి. ఆ గ్రామంలో ఇపుడు బీడు భూముల జాడ లేదు. జనాభా కూడా 1250 మందికి చేరుకుంది. దశాబ్దాల పాటు గ్రామానికి దూరంగా వున్నవారు సైతం సొంతూరుకు తిరిగి వచ్చేసి వ్యవసాయం చేసుకుంటున్నారు. మట్టి మార్గాలు పోయి పక్కా సిమెంట్ దారులు ప్రతి వీధిన వచ్చేశాయి. దేశంలో చాలా అరుదుగా ఇక్కడ ప్రతి ఇంటికీ మరుగు దొడ్డి ఉంది. ఆరోగ్యంపై చైతన్యం ఎక్కువ. అక్కడ పెళ్లికి ముందు హెచ్ఐవీ/ఎయిడ్స్ పరీక్షలు చేయించుకోవాల్సిందే. కుటుంబ నియంత్రణ పాటించాల్సిందే. చెత్త సమస్యకు కూడా సరైన పరిష్కారం చూసుకున్నారు. జనాభా సగటు ఆదాయం నెలకు 30 వేల రూపాయల పైమాటే. సరిగ్గా పదేళ్ల క్రితం అది 830 రూపాయలుగా ఉండేది. ఆర్థిక స్వావలంబనతో ఇప్పుడా గ్రామ ముఖచిత్రమే మారిపోయింది. కూడు, గూడే కాదు సొంతూరనే అభిమానం కూడా వారి పునరాగమనానికి తోడైంది.

ఆమె జీవితమంతా

క్యాన్సర్ రోగులకే అంకితం

చెన్నైలోని అడయార్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఛైర్ పర్సన్‌గా అరవయ్యేళ్లుగా అంకిత భావంతో, చిత్తశుద్ధితో క్యాన్సర్ వైద్యం అందిస్తున్నారు డా॥ శాంత. క్యాన్సర్ నిర్మూలనకు, నివారణకు ఆమె పడే తపన అంతకంతకూ పెరిగిందే కానీ తగ్గలేదు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్ని అవార్డులు, అభినందనలు అందుకున్నా ... క్యాన్సర్ నయమై సంతోషంగా ఇంటిముఖం పట్టే రోగిని చూసినప్పుడు ఆమె పొందే ఆనందమే వేరు. ఆ సందర్భంలో ఆమె మోములో కన్పించే వెలుగే వేరు.

అడయార్ క్యాన్సర్ ఆస్పత్రి అనగానే పెద్ద భవనం, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు కలిగిన వైద్యం, నిపుణులు మనకు స్ఫురణకు వస్తారు. అయితే ఆస్పత్రి ప్రారంభించిన తొలినాళ్లలో ఒక పక్కా భవనం, పన్నెండు పడకలున్న కొన్ని పూరి గుడిసెలు, ఇద్దరు వైద్యులు, అంతంత మాత్రపు వైద్య సౌకర్యాలు మాత్రమే వుండేవి. ఆ ఇద్దరు వైద్యుల్లో ఒకరు డా. కృష్ణమూర్తి (డా.ముత్తులక్ష్మి రెడ్డి కుమారుడు) కాగా మరొకరు డా.శాంత. వాస్తవానికి డా.కృష్ణమూర్తి అమెరికాలో శిక్షణ పొందారు. అక్కడే వైద్యుడిగా కొనసాగుతుండగా ఓరోజు 'మదర్ సీరియస్' అన్న టెలిగ్రామ్ అందింది. అంతే! రెక్కలు కట్టుకొని చెన్నైలో వాలిపోయారాయన. తీరా వచ్చి చూస్తే... అమ్మ క్షేమమే. కాకపోతే ఆమెదో కోరిక. చెన్నైలో ఒక క్యాన్సర్ ఆస్పత్రిని ఏర్పాటు చేయాలని. ఇంకేముంది! అమ్మ కోరిక తీర్చాడా తనయుడు. అలా ఏర్పడిందే అడయార్ క్యాన్సర్ ఆస్పత్రి. డా.శాంత మొదటిసారిగా కృష్ణమూర్తి మార్గదర్శకత్వంలోనే పనిచేశారు. నెలకు 200 రూపాయల జీతం. ఆస్పత్రిలోనే నివాసం కూడా. అలా అక్కడ అడుగెట్టి అరవయ్యేళ్లు పూర్తయ్యాయి. ఆ ఆస్పత్రే ఆమెకు ఆలయం. రోగుల సేవే ఆమెకు మాధవ సేవ. ఈ సుదీర్ఘ కాలంలో ఎన్నో ముళ్లు, ఎదురు చూపులు, నిరాశలు, బాధలు, గాయాలు...! ప్రయివేటుగా ఓ ఆస్పత్రిని...అందునా క్యాన్సర్ ఆస్పత్రిని నడపడం చిన్న విషయం కాదు. నిధుల కొరత ప్రధానంగా వేధించే సమస్య. అప్పట్లో దేశంలో ఒకే ఒక్క క్యాన్సర్ ఆస్పత్రి వుండేది. అదే టాటా మెమోరియల్ ఆస్పత్రి (ముంబై). పైగా శస్త్రచికిత్స, రేడియో థెరపీ మాత్రమే అందుబాటులో వుండేది. బాధ విపరీతంగా వుండడంతో రేడియో థెరపీ అనగానే రోగులు భయపడిపోయేవారు. దానికితోడు వయసు పైబడిన వాళ్లకు మాత్రమే క్యాన్సర్ వస్తుందని, అది వస్తే మరణమేనని, చికిత్స వుండదని భావించే కాలమది. అయితే 'ఏ వయసు వారికైనా క్యాన్సర్ సోకుతుంది. తొలి దశలోనే వ్యాధిని గుర్తిస్తే దానికి చికిత్స వుంది' అన్నదే డా॥శాంత అప్పుడూ...ఇప్పుడూ...ఎప్పుడూ చెప్పే మాట. తొలి దశలోనే వ్యాధిని గుర్తించేందుకు, నివారించేందుకు, నయం చేసేందుకే ఆమె సుదీర్ఘకాలంగా కృషి చేస్తున్నారు. అందుకోసం ఎన్నో ప్రయోగాలు చేశారు. చేస్తున్నారు. ఎన్నో చికిత్సాంశాలను తొలిసారిగా ప్రవేశపెట్టిన ఘనత అడయార్ ఆస్పత్రిది. దక్షిణ భారత దేశంలో తొలి క్యాన్సర్ ఆస్పత్రి అది. క్యాన్సర్ రోగులకు సంబంధించి ఒక రిజిస్టర్ ప్రారంభించడమే కాక మొదటిసారిగా ఒక సర్వే చేసింది. చిన్నారులకు ప్రత్యేకంగా ఆంకాలజీ విభాగాన్ని ఏర్పాటు చేసింది. రోగుల్లో 20 శాతం మందికి (పేదలకు) ఉచిత చికిత్స అందిస్తోంది. ఆ శాతాన్ని మరింతగా పెంచాలన్నది అడయార్ క్యాన్సర్ ఆస్పత్రి ఛైర్‌పర్సన్‌గా శాంత కోరిక.

నేపథ్యం...

వైద్య వృత్తికే తలమానికంగా నిలిచిన డా॥వి.శాంతకు గొప్ప నేపథ్యముంది.చెన్నైలోని మైలాపూర్‌లో... శాస్త్రవేత్తలుగా, పరిశోధకులుగా నోబెల్ బహుమతులు అందుకున్న సి.వి.రామన్, ఎస్.చంద్రశేఖర్ వంటి మహనీయుల కుటుంబంలో జన్మించారామె. అయితే తనకంటూ ఓ ప్రత్యేకత చాటుకునేలా... గొప్ప డాక్టర్ కావాలని చిన్నతనం నుంచి కలలు కనేది. ప్రాథమిక విద్యాభ్యాసం అంతా నేషనల్ గరల్స్ హైస్కూల్లోనే సాగింది. ఆ తర్వాత తన కలను నిజం చేసుకుంటూ మద్రాస్ మెడికల్ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి 1955లో ఎం.డి పట్టా పొందింది. మేనమామ ఎస్.చంద్రశేఖర్, చిన తాతగారైన సర్.సి.వి.రామన్ తన రోల్ మోడల్స్ కాకపోయినా... ఆ ఇద్దరి మేధావుల ప్రభావం తన మీద ఎంతో వుందంటారు. క్యాన్సర్ వైద్యురాలిగా అడుగెట్టింది మొదలు అనుక్షణం క్యాన్సర్ రోగుల మోముల్లో వెలుగులు చూసేందుకే, జబ్బును నయం చేసేందుకే కృషి చేశారు. ఆ అపారమైన సేవకుగాను ఆసియా నోబెల్‌గా భావించే రామన్ మెగసెసే అవార్డు, ప్రతిష్టాత్మక పద్మశ్రీ, పద్మ భూషణ్ అవార్డులు అందుకున్నారు. అడయార్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ ఛైర్‌పర్సన్‌గానే కాక పలు జాతీయ, అంతర్జాతీయ ఆరోగ్య వైద్య సంస్థల్లో ముఖ్య సలహాదారుగా కూడా వ్యవహరిస్తున్నారు.

పేదలకు ఉచిత సేవ చేయడంలోనే అమితమైన ఆనందాన్ని వెతుక్కునే డా. వి.శాంత ఎందరికో మార్గదర్శి. నేటి తరం ఈ వృత్తిని గురుతర బాధ్యతతో నిర్వర్తిస్తే ఎందరో అభాగ్యులకు కొత్త జీవితం లభిస్తుందంటారు, నిస్వార్థంగా వైద్య సేవలు చేస్తూ పొందే తృప్తిని మరే విధంగానూ పొందలేమంటారు శాంత.

క్యాన్సర్‌తో బాధపడుతున్న ఎందరికో ఆమె మాతృమూర్తి. ఆమె హస్తవాసి ఎందరికో బతుకునిస్తోంది. క్యాన్సర్ రక్కసితో పోరాడి అలసిపోయిన వ్యాధిగ్రస్తులను తల్లిలా ఆదరిస్తోంది. ఆమె దగ్గరకి కొన ఊపిరితో వచ్చి చిరునవ్వుతో తిరిగి వెళ్లినవారెందరో! క్యాన్సర్ భూతాన్ని తరిమికొట్టడానికి ఆరు దశాబ్దాలుగా శాయశక్తులా శ్రమిస్తున్న ఆ అలుపెరగని వైద్యురాలే డా॥ వి.శాంత. వైద్య రంగంలో పరిచయం అవసరం లేని పేరు ఆమెది. లక్షలాది మందికి వ్యాధి నయం చేసిన అనుభవం, మరెన్నో పరిశోధనలు చేసిన సుదీర్ఘ ప్రయాణం ... అయినా అదే నిరాడంబరత, నిగర్వం. అదే నిబద్ధత.



✦

వాలీబాల్ పులి



సుబ్బా ఎదురు నిలబడితే వాలీబాల్ నెట్ అవతల ఏదో గోడ అడ్డంగా ఉన్నట్లు ప్రత్యర్థులు ఊహిస్తారు. భారత వాలీబాల్ క్రీడలో చైనా వాల్‌గా పిలిచే సుబ్బా గొప్ప బ్లాకర్. వింగ్ స్పైకర్‌గాను ప్రత్యర్థులను హడలెత్తించే ఈ తెలుగు క్రీడా వీరుడి గురించి తెలిసింది చాలా తక్కువ. ఇటలీ, అర్జెంటీనా క్లబ్‌ల తరపున లాటిన్, యూరోపియన్ లీగుల్లో ఆడే అవకాశాన్ని దేశం కోసం వదులుకున్న సుబ్బా పూర్తి పేరు యెజ్జు సుబ్బారావు.

గ్రామాల్లోను వాలీబాల్ ఆడుతూ కనిపించే యువత ఎక్కువే. కానీ దేశం తరపున అంతర్జాతీయ వేదికల్లో పోరాడుతున్న వాలీబాల్ క్రీడావీరుల పేర్లు చెప్పమంటే చాలా మందికి పెదవి తొణకదు. అర్జున అవార్డుకు అన్ని అర్హతలున్నా కేవలం ప్రచారం, గుర్తింపు లేకపోవడం వల్లే సుబ్బా లాంటి క్రీడాకారులు లైమ్‌లైట్‌లోకి రావడంలేదు. ప్రత్యర్థులను ముప్పు తిప్పలు పెట్టే సుబ్బా ఎత్తు 6 అడుగుల 10 అంగుళాలు. బరువు 90 కేజీలు. స్పైక్ 140 అంగుళాలు. బ్లాక్ 130 అంగుళాలు. సుబ్బా చిరుతలా కదులుతుంటే బాల్‌ను ఎక్కడ హిట్ చేయాలో తెలీక ప్రత్యర్థులు అయోమయంలో పడిపోతారు. అందుకే మ్యాచ్‌కు ముందే సుబ్బాను టార్గెట్ చేసుకునే వ్యూహాలు అల్లుకుంటారు. అయినా కూడా బంతిని తమ కోర్టులో పడనివ్వడు సుబ్బా. అతడి ఆటతో బ్లాకింగ్ అనేది అతి కీలకమైందిగా గుర్తించారు. ఇప్పుడు ఎక్కడైనా మంచి బ్లాకర్ టీమ్‌లో కనిపిస్తే మరో సుబ్బా వచ్చాడని అంటుంటారు. అస్సాం నుంచి కేరళ జట్టు వరకు సుబ్బా వేసిన స్టాంప్ అది. అతనిది నెల్లూరు. తండ్రి నాగేశ్వరరావు ఢిల్లీలోని బహదూర్‌గఢ్ హిండ్‌వేర్ సంస్థలో జనరల్ మేనేజర్‌గా పనిచేసేవారు. ఢిల్లీలో పెరిగిన సుబ్బా 1994లో ఓ అథ్లెటిక్ మీట్‌కు వెళ్లాడు. పిల్లలందరిలో కొట్టొచ్చినట్టు అంతెత్తున కనిపించిన సుబ్బాపై పేరొందిన ఢిల్లీ వాలీబాల్ కోచ్ పండిట్‌జీ దృష్టి పడింది. వెంటనే సుబ్బాని మరో సీనియర్ కోచ్ సక్సేనా దగ్గరకు తీసుకెళ్లారు. రమేష్ నగర్‌లోని వాలీబాల్ గ్రౌండ్‌లో శిక్షణకు పంపేలా వారు సుబ్బా తండ్రిని ఒప్పించారు. వాలీబాల్‌పై పట్టు సంపాదించి ఢిల్లీ జట్టు తరపున ఆడటం మొదలెట్టాడు.

చైనా వాల్..

2003లో చైనా తియాన్జిన్‌లో జరిగిన ఏసియన్ సీనియర్ చాంపియన్‌షిప్‌లో సుబ్బా అతి అరుదైన ఫీట్ చేశాడు. 'బెస్ట్ అటాకర్, బెస్ట్ బ్లాకర్, మోస్ట్ వాల్యుబుల్ ప్లేయర్ ఆఫ్ ఏసియా' అవార్డుల్ని సాధించిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టించాడు. సుబ్బా సారథ్యంలో భారత జట్టు మెరుగ్గా రాణించింది. ఆ పోటీల్లోనే తొలిసారి 'చైనా వాల్' అని పిలిపించుకున్నాడు. ప్రపంచ జట్లు, అభిమానుల చూపంతా సుబ్బాపై పడింది. 2004 ఏసియా చాంపియన్‌షిప్‌లోను బెస్ట్ బ్లాకర్‌గా నిలిచాడు. జూనియర్ ఏసియన్ చాంపియన్‌షిప్ సందర్భంలోనే సుబ్బా చేతివాటం ప్రత్యర్థులు రుచిచూశారు. చైనా, కొరియా జట్ల దాడుల్ని నిలువరిస్తున్న సుబ్బాపై అప్పుడే అంతర్జాతీయ క్లబ్‌ల దృష్టి పడింది. లాటిన్ అమెరికా లీగుల్లో ఆడేందుకు అక్కడి క్లబ్‌లు సుబ్బా జట్టులో చేరాలని కోరాయి. ఇటలీ క్లబ్‌ల తరపున కూడా యూరోపియన్ లీగుల్లో ఆడేందుకు అవకాశం వచ్చింది. కానీ దేశం కోసమే ఆడేందుకే సుబ్బా మొగ్గుచూపాడు. లెబనాన్‌లో జరిగిన ప్రొఫెషనల్ లీగుల్లో ఆడిన సుబ్బా అక్కడి వాలీబాల్ అభిమానులకు ఇష్టమైన క్రీడాకారుడిగా మారిపోయాడు. సుబ్బాకు లెక్కలేనన్ని బెస్ట్ ప్లేయర్ అవార్డులు వచ్చాయి. దేశవాళీ లీగుల్లో సుబ్బా ఓ ఐకాన్, రాక్‌స్టార్. ఇదంతా కేవలం అతడి ఫిజిక్ ద్వారా తేలిగ్గా వచ్చేసింది కాదు. జూనియర్ జట్టులో స్థానం సంపాదించేందుకు చాలా కష్టపడ్డాడు. ఓ ప్రోబబుల్స్ మ్యాచ్‌లో స్టార్ ఆటగాడు మనోజ్ కుమార్ ఠాకూర్ శక్తివంతమైన కౌంటర్ అటాక్‌ను ఎదుర్కోలేక నేలను కరుచుకున్నాడు. ఆ పరాభవాన్నే తన విజయ సోపానంగా మలుచుకున్నాడు. ద్రోణాచార్య అవార్డు గ్రహీత శ్యామ్ సుందర్ రావు శిక్షణలో కఠోర శ్రమతో తన స్థానాన్ని జట్టులో సుస్థిరం చేసుకున్నాడు. కోచ్ పాండియన్ శిక్షణలో అనేక మెళుకువల్ని నేర్చుకున్న సుబ్బా బ్లాకింగ్‌లో తన పేరును బ్రాండ్‌గా మార్చాడు. సుబ్బా క్రీడా జీవితంలో మరపురాని సందర్భం... 2004 ఇస్లామాబాద్ ఎస్ఎఎఫ్ గేమ్స్‌లో పాకిస్తాన్ జట్టుపై తన సారథ్యంలోని భారత జట్టు గెలిచి స్వర్ణ పతకం సాధించినది. పాకిస్తాన్‌లో త్రివర్ణ పతాకం ఎగురుతుండగా, భారత జాతీయ గీతం వినిపిస్తున్నపుడు సుబ్బా భావోద్వేగాలు ఎప్పటికీ దేశాభిమానులకు గుర్తుండిపోతాయి. ప్రస్తుతం దేశవాళీ లీగుల్లోను ఆడుతున్న సుబ్బా ముప్పై నాలుగేళ్ల వయస్సులోను కోర్టులో పాదరసంలా కదిలిపోతూ.. వాలీబాల్‌ను కెరీర్‌గా ఎంచుకునే భావి క్రీడాకారులకు రోల్ మోడల్.

కనిపించని
నాలుగో సింహాన్ని !!
ఢిల్లీ
విద్యార్థులు
గంగాధర్


రిజర్వేషన్ల డిమాండ్
కాంగ్రెస్
BJP
TDP
YSRCP


మా కష్టం.. చూస్తుంటే..
గుండె తరుక్కుపోతోంది...
తీసుకోండి బాబయ్యా!!
?!
మోడీ దగ్గర నగదు 4700 రూ. మాత్రమే ఉందట

కార్టూన్ పంచ్


భోగాపురం
భూములపై
-కోర్టు

ఇంటిపై పంట

ముంబైలోని కిక్కిరిసిన భవంతుల మధ్య రద్దీ దారులు. సందుగొందుల్ని దాటి రమేష్ ఓ అపార్ట్‌మెంట్ కాలింగ్ బెల్ నొక్కాడు. పైనుంచి తాడుకు కట్టిన బుట్ట కిందకు వదిలారు. రమేష్ ఆ బుట్టలో పాల ప్యాకెట్ వేయలేదు. దాన్లో ఉన్న కూరగాయల్ని తన సంచిలో పోసుకున్నాడు. వాటిని తేరిపార చూసుకుని బుట్టలో డబ్బులేసి కదిలాడు. బుట్ట పైకి లాగేశారు. చెన్నైలో ఓ కాలనీ. పక్కింటావిడ సుప్రియ ఆర్ముగం ఇంటి తలుపు తట్టింది. అతడి భార్య పద్మ నవ్వుతూ పలకరించింది. ఇద్దరూ డాబాపైకి వెళ్లారు. విరగపండిన టమోటాల్ని జాగ్రత్తగా తుంపడం మొదలెట్టారు. బెంగళూరు శివారున కొన్ని ఫ్లాట్లు. ఒక భవంతి నుంచి మరో భవంతికి అల్లుకున్న చిక్కుడు పాదు. కొందరు ఆ తీగెలు తెగిపోకుండా వైరుతో మెట్ల వరసకు అల్లిస్తున్నారు. విజయవాడకు చిహ్నంగా ఒకదానికొకటి అతుక్కున బిల్డింగ్‌లు. వాటి మధ్య ఉన్న ఓ భవంతిపై ఇంటోళ్లు మొక్కల కుండీల్లోకి నీళ్లు పడుతున్నారు. ఇక్కడంతా జరిగేది ఓ గొప్ప విప్లవం. నిశ్శబ్దంగా సాగిపోతున్న ఓ పెద్ద ప్రత్యామ్నాయం. అదే నగర సేద్యం. బిందు సేద్యం విన్నాం గానీ నగర సేద్యం ఏమిటా? అని ఆలోచించాల్సిందేం లేదు. ఒకప్పుడు ఇంటికో పెరడు. పూల చెట్లతో సమానంగా కూరగాయల మొక్కలు. పక్కింట్లో లేని వాటిని ఈ ఇంట్లో పండించి గోడల దగ్గర గాసిప్‌లతో పాటు వంటింటి

నగరాల్లో వ్యవసాయం. బిల్డింగ్‌లపై ఫలసాయం. ఎలా సాధ్యం? మర్రి మానునూ ఎండగట్టే కాంక్రీట్ అరణ్యంలో.. గజం చోటుకి గోడ కట్టేస్తున్న స్కైలైన్‌లో.. నగర కర్షకులు సేద్యానికి విత్తు నాటారు. దాని వేర్లు క్రమంగా పట్టణాలన్నింటికీ పాకి పోతున్నాయి. నగర సేద్యంగా పిలవబ డుతోన్న ఈ కొత్త తరహా రూఫ్ గార్డెన్‌లలో పూలకు బదులు పండ్లు, కూరగాయలు పండించేస్తున్నారు. వంట గదికి అందించేస్తున్నారు. ఆహార భద్రతకు చివుళ్లు వేస్తోన్న నగర సేద్యమే ఈ వారం అట్ట మీది కథ.

అజయ్ కుమార్ వారాల

సెల్: 9502395077

సరకు మార్చుకునే ఇరుగు పొరుగు. కానీ క్రమంగా నగరానికి రూపం మారిపోయింది. పట్నాల్లో ఇంటి పెరడు అనే మాట కనుమరుగైపోయింది. కరివేపాకును కూడా తీసిపడేయలేం. అది అయిపోకుండానే మార్కెట్‌కు పరుగులు తీయాల్సిందే. అందుకే పెరటి పంటనే ఇపుడు కొత్తగా డాబాలపైకి ఎక్కిస్తున్నారు. పెరడనే మాట లేకున్నా కూరలోకి చేర్పు కోసం పైకప్పు మీద కలియతిరుగుతున్నారు. డాబాలపై, అపార్ట్‌మెంట్‌లపై కూరగాయ తోటల్ని పెంచడం ఇప్పుడు ఎక్కువైంది. కూరగాయ ధరలు చేసే గాయాలకిది కీలకమైన మందు.

2014 ఐక్యరాజ్య సమితి లెక్కల ప్రకారం ప్రపంచ జనాభాలోని 54 శాతం మంది నగరాల్లోనే జీవిస్తున్నారు. అంటే 350 కోట్ల మందికి పైగానే. ఓ రెండు గదుల గూడుకు కూడా చోటు లేనంతగా నగరాలు కిక్కిరిసిపోయాయి. ఏటా కొన్ని కోట్ల మంది వలసల తాకిడితో ఈ సమస్య మరింత పెద్దదవుతోంది. డిమాండ్‌కు తగిన ఆహార లభ్యత పల్లెల నుంచి అందడంలేదు. అక్కడి నుంచి వచ్చే కూరగాయల్ని సంచుల్లో వేసేందుకు గొడవలే జరుగుతుంటాయి. ఈ సమస్యలన్నింటికీ పరిష్కారంగానే ఈ నగర సేద్యాన్ని నమ్ముకుంటున్నారు. ఇది విప్లవాత్మకమైన

పరిష్కారాలు చూపడమే కాకుండా గ్రేయిష్ కాంక్రీట్ ల్యాండ్‌స్కేప్‌ల్లో హరితందాన్ని చేకూరుస్తున్నాయి. గాలిని రిపేరు చేస్తున్నాయి. క్రిమిసంహారాలతో, నిల్వ రసాయనాలతో కలుషితం కానీ స్వచ్ఛమైన పంటను చేతికందిస్తున్నాయి. ఎక్కడో ఓ ఇంటిపై ఎపుడో చూశామని తేలిగ్గా తీసేయడానికి లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అవుతున్న ఆహారంలో నగర సేద్యం వాటా 15-20 శాతం మధ్య ఉందని లెక్కలు. అంటే ఇంచు మించు మన దేశ జనాభా అంతటికీ సరిపడా ఆహారం అందుతోందన్న మాట. 2050 కల్లా మనదేశంలో 90 కోట్ల మంది పట్టణాల్లో నివసిస్తారని అంచనా. అర్జెంటీనా నుంచి జపాన్ వరకు ఆహార సమస్య పరిష్కారంలో నగర సేద్యం ప్రముఖ పాత్ర పోషిస్తోంది. ఆ దేశ ప్రభుత్వాలు ప్రత్యేక ప్రోత్సాహకాలతో నగర సేద్యం విస్తృతమయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అర్జెంటీనానే తీసుకుంటే నగరాల్లో ఏవైనా ప్రభుత్వ ఖాళీ జాగాలుంటే వాటిలో కూరగాయ తోటలు పెంచడానికి పౌరులకు అనుమతినిస్తున్నాయి. జింబాబ్వేలాంటి దేశాల్లో ఈ పద్ధతి వల్ల లీగల్ సమస్యలు పెరగడంతో దాన్ని పక్కన పెట్టేస్తున్నాయి కానీ ఓ గొప్ప ప్రత్యామ్నాయాన్ని కాళ్లదన్నుకుంటున్నాయి. సింగపూర్‌లో ఇదో విప్లవాత్మక ఆవిష్కరణలకు పాదులు వేస్తోంది. ప్రపంచంలోనే తొలిసారిగా నిట్టనిలువున వ్యవసాయం చేసే క్షేత్రాన్ని అక్కడి ఇంజినీర్లు రూపొందించారు. ఆంగ్ల అక్షరం 'ఎ'ను పోలి ఉండే నిర్మాణాల్లో మట్టిని, నీటిని అతి తక్కువగా వాడే

సేద్యం విధానాలకు అంకురం తొడిగారు. స్విట్జర్లాండ్ మరో అడుగు ముందుకేసి ఆక్వాపోనిక్స్ అనే నూతన వ్యవసాయ పోకడను ప్రవేశపెట్టింది. రోమన్ గాజ్, ఆండ్రియాస్ గ్రేబర్‌ల బృందం ఇంటి పైకప్పులపై మట్టి ఉపయోగించకుండానే నీటి ట్యాంకుల ద్వారా అటు చేపల్ని ఇటు మొక్కల్ని పెంచే విధానాన్ని అభివృద్ధి చేశారు. ఎరువుల మాటేలేని ఈ విధానంలో టన్నుల కొద్దీ పంట ఉత్పత్తిని చేయగలుగుతున్నారు. క్యూబా అత్యవసరం మరో పోకడకు వెళ్లానుంది. 1989లో సోవియట్ యూనియన్ దెబ్బతిన్నాక తీవ్ర ఆహార సంక్షోభంలో పడిందా దేశం. అప్పట్లో సుమారు 22 లక్షల మంది ప్రజలకు ఆహారం చేరవేత పెద్ద ప్రశ్న అయ్యింది. దీని నుంచి బయటపడేందుకు ఆ దేశం ఓ గొప్ప సేద్య విధానాన్ని అమలుచేసింది. నగర జీవులు కనిపించిన జాగాలో కూరగాయలు పండించడాన్ని ఉద్యమంగా చేపట్టారు. ఇప్పటికీ ఆ దేశంలో నగర సేద్యం ఉనికి ఎక్కువగా కనిపిస్తుంది. ఇన్నిందాలా మేలు చేస్తున్న నగర సేద్య విప్లవాన్ని కొందరు పట్నపు కర్షకులు ముందుండి నడిపిస్తున్నారు. ఆ హరిత లతల్ని పది ఇళ్లకు, పది ఊళ్లకు పాకిస్తున్నారు. గార్డెన్ సిటీ బెంగళూరుకు ఆ పేరనేది పబ్లిక్ గార్డెన్‌ల వల్ల రాలేదని, ప్రతి ఇంటా కనువిందు చేసే పెరడు వల్లేనని బలంగా చెప్పే వారిలో నగర కర్షకులు ముందుంటారు.

ప్రయోగ భోజనం

దేశంలోని చాలా నగరాల్లో ఇది ప్రయోగాత్మకంగా ప్రారంభమైంది. ఈ మధ్యే దీనిపై

మన వాడలో..

ఒక్క నడిచే దార్లు తప్పితే మిగతా స్థలమంతా భవనాలతో నిండిపోయి ఉంటుంది విజయవాడలో. మరీ చిన్నవి కానీ, మరీ పెద్దవి కానీ డాబాలకు అది చిరునామా. ఇదో రకంగా ప్లస్ కూడా. అపార్ట్‌మెంట్లు ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్నా చాలా వరకు డాబా ఇళ్లే కావడం వల్ల కూరగాయలు పెంచుకోవడానికి కావాల్సినంత పైకప్పు స్థలం ఉంటుంది. దీన్నే అనుకూలంగా మార్చుకున్నారు చలసాని దత్. విదేశాల్లో బాగా విస్తరించిన 'స్క్వేర్ ఫూట్ గార్డెన్'ను ఇక్కడి పరిస్థితులకు అన్వయించుకుని తన డాబాపై సేద్యం మొదలెట్టారు. పూల కుండీల్లో కాకుండా ఇటుకలతో నిర్మించిన ఓ చతురస్రాకారపు తావులో టార్పాలిన్ పట్టా ఉంచి దానిలో మట్టి వేసి మొక్కలు పెంచడమే ఈ పద్ధతి. అమెరికాకు చెందిన మెల్ బార్త్‌లోమ్యీ ఈ పోకడను అభివృద్ధి చేశారు. దానిపై 1981లో ఓ పుస్తకం కూడా తెచ్చారు. మట్టి సారాన్ని ఎప్పటికప్పుడు పెంచుతూ.. దగ్గరదగ్గరగా వేసిన మొక్కల పెరుగుదలకు తగ్గట్టు కంపోస్ట్‌పై దృష్టి కేంద్రీకరిస్తారు. సాధారణంగా కనిపించే సేద్య పద్ధతిలో కేవలం 20 శాతం మాత్రమే ఈ తరహా సేద్యానికి అవసరమవుతుంది. నీటి వినియోగం, ఎరువుల ఉపయోగం దాదాపు 80 శాతం తగ్గిపోతుంది. తక్కువ చోటులో ఎక్కువ ఫలసాయాన్ని ఇచ్చే ఈ పద్ధతిని బాగా ఆకళింపు చేసుకున్న దత్ తన డాబాపై 16 రకాలకు పైగా కాయగూరల్ని పండిస్తున్నారు.

ఫలాలు చేతికందడానికి ఆరు నుంచి ఎనిమిది వారాలు పడతాయి. వంకాయ, పొట్లకాయ, టమోటాలు, మిర్చి, బెండకాయలు, చిక్కుళ్ళతో పాటు ఆకు కూరల్ని కూడా దత్ పండిస్తున్నారు. కందిపప్పు, వరిని కూడా పరీక్షిస్తున్నారు. కేవలం 40 ఇటుకలు, 20 చదరపు అడుగుల పాలిథీన్ షీట్, 40 అడుగుల ప్లాస్టిక్ పైప్, 8 ఘనపు అడుగుల కంపోస్ట్ ఉంటే చాలు. మీరు కూడా మీ డాబాపై 'స్క్వేర్ ఫూట్ గార్డెన్'ను మొదలెట్టేయొచ్చు. వేదిక్ అగ్రి కల్చర్, బయో- డైనమిజమ్, వర్మీకల్చర్, వర్షపు నీటి నిల్వలతో ఎక్కువ ఉత్పత్తి సాధ్యం చేయొచ్చంటారయన. కంపోస్ట్ వల్ల మట్టిలోని తేమ నిలుస్తుంది. బయో-డైనమిజమ్.. మొక్కల్లోని జీవ క్రియలు ఆనుపానులు తెలుసుకుని వాటికి తగ్గట్టుగా మొక్కల్ని పెంచేందుకు అవకాశం కలిగిస్తుంది.

అవగాహన ఎక్కువవుతోంది. తిరువనంతపురంలోని ఆర్ రవీంద్రన్ నగర కర్షకుల్లో ఒకరు. ఆయన తన డాబాపై 15 రకాల కాయగూరల్ని పండిస్తున్నారు. బిందు సేద్యం పద్ధతిని అన్వయించి అతి తక్కువ అవసరాలతో తన 1450 చదరపు అడుగుల టెర్రస్‌పై ఈ సేద్యమంతా సాగిపోతోంది. 2011 నుంచి ప్రయోగాలు చేస్తూ చివరకు విజయం సాధించారు. పంట ఒక కుటుంబానికి సరిపోవడమే కాక మిగులు కూడా ఉంటుందని ఆయన అంటారు. కేరళలో బంధుమిత్ర సపరివారంగా జరుపుకునే ఓనమ్ పండగకు గత నాలుగేళ్లుగా టెర్రస్‌పై కాసే ధాన్యం సరిపోతోందని ఆయన చమత్కరిస్తారు. సుమారు 15 కేజీల బియ్యం దిగుబడి ఉంటుంది. అదే కేరళలోని కోజికోడ్‌లో ఓ నగర సేద్యం బృందం తమలాంటి వారిని మరికొందరిని తయారుచేస్తోంది. హైబ్రిడ్ వంగడాలతో సంబంధం లేకుండా స్థానిక గింజలతోనే అద్భుతాలు చేయొచ్చని చెప్పే నీరవు ఫార్మర్స్ క్లబ్ ద్వారా ఇప్పటికే 25 కుటుంబాలు కలిసి తమ ఇళ్లపై పంట పండిస్తున్నాయి. క్లబ్‌కు చెందిన పెద్దలు వారికి మెళకువలు నేర్పిస్తున్నారు. చెన్నైలోని ముగలివాక్కం ఆశ్రమ్ అవెన్యూలో 80 ఇళ్లు ఉంటాయి. వాటిలో పదిళ్లపై పచ్చని పరదా కప్పినట్టు ఉంటుంది. అది ఇరుగు పొరుగు కలిసి తమ టెర్రస్‌లపై ప్రారంభించిన నగర సేద్యం. వనమూలికల్ని కూడా పెంచడం ఇక్కడ విశేషం. మోహన్‌దాస్ అనే వ్యక్తి ఈ ట్రెండ్ తీసుకొచ్చారు. మరో కొత్త పోకడ అయిన 'టవర్ గార్డెన్'ను ఇంటర్‌నెట్ ద్వారా తెలుసుకున్న ఆయన దీన్ని తోటి వారితో పంచుకుని తోటను పెంచుకుతున్నారు. చాలా తేలికైన ఈ విధానంలో 60 రకాల కాయగూరల్ని పండించొచ్చు. దీనికి టెర్రస్‌తో పనిలేదు. ఇళ్లకు బాల్కనీ ఉంటే చాలు. ఓ టవర్‌లా మొక్కలు పెంచే వేదికను ఏర్పాటు చేసుకుంటే సరి. ఇలాంటి ఒక్కో టవర్ ఒక కుటుంబానికి ఏడాదికి సరిపడా కాయగూరల్ని అందించే అవకాశం ఉంది. తన ఇంటి బాల్కనీని టవర్ గార్డెన్ ప్రయోగ శాలగా మార్చుకుని ఎప్పటికప్పుడు కొత్త చిట్కాలతో స్నేహితుల నగర సేద్యం సమస్యలు తీర్చే పనిలో ఉన్న ఆయన ఇప్పుడు బయోగ్యాస్ ప్లాంట్‌ను కూడా తమ ఇళ్లకు దగ్గర ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాడు. పంట చెత్త ద్వారా ఇంధనం తయారుచేయడం లక్ష్యం. మోహన్‌దాస్ పక్కింటాయన సుందరమ్ కూడా ఓ ఉపాయాన్ని తోటి నగర రైతులకు చెబుతున్నాడు. చెరకు పిప్పిని గనుక మట్టిపై పరిస్తే తీవ్ర పగటి వేడిమి వల్ల నీరు ఆవిరవకుండా తేమ నిలుస్తుందని ఆయన గమనించాడు. వీరంతా కలిసి తమ కాలనీ అంతటా నగర సేద్యం విస్తరించేలా చైతన్యం తెస్తున్నారు. ముంబై పోర్ట్ ట్రస్ట్ క్యాంటీన్‌కు కావాల్సిన కాయగూరల కోసం దాని పక్కనే ఉన్న 3000 చదరపు అడుగుల ఖాళీ జాగాని తోటలా మార్చేసింది కేటరింగ్ అధికారి ప్రీతి పాటిల్. ఆ విజయాన్ని మిగతా ముంబైకర్లకు పంచాలని 'అర్బన్ లీవ్స్' అనే ఎన్జీవోను 2009లో ప్రారంభించింది. జీవ వ్యర్థాల ద్వారా పోషకాలు పుష్కలంగా ఉన్న తేలికపాటి మట్టి మిశ్రమాన్ని 'అమృత మిట్టి' పేరిట అందరికీ అందిస్తోంది. ఆమె వర్క్‌షాపులకు వెళ్లి నగర సేద్యంపై అవగాహన పెంచుకునేందుకు ఆసక్తి చూపుతున్నవారు రోజు రోజుకీ పెరుగుతున్నారు.

పంట ఇలా..

రోజులో నాలుగైదు గంటలు సూర్యకాంతి పడే అవకాశముండే బాల్కనీనో, టెర్రసో మరే ఇతర కాస్త ఖాళీ జాగా ఉంటే దాన్ని కాయగూరల తోటలా మార్చుకోవచ్చు. 600 చదరపు అడుగుల స్థలం ఉంటే ఎంచుకున్న కాయగూరల రకాలను బట్టి వారంలో పది కేజీల వరకూ కాయగూరల్ని పొందొచ్చు. ఇదే మాట బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హార్టికల్చరల్ రీసెర్చ్ శాస్త్రవేత్త డా॥ ఎం. ప్రభాకర్ అంటున్నారు. 1200 చదరపు అడుగుల స్థలం ద్వారా ఐదుగురికి సరిపడా కాయగూరల్ని వంటింటికి అందించేయొచ్చని. నగర సేద్యానికి పెద్ద సరంజామాతో పనిలేదు. సిమెంట్ కుండీలు కొనకుండా పాడైన టైర్లు, విరిగిన బకెట్లు, డ్రమ్ములు, గోనె సంచులతో మట్టి దిబ్బలను వేసేయొచ్చు. విత్తనాలు, మొలకల ఎంపికలో జాగ్రత్తగా ఉంటే సగం సమస్య తీరినట్టే. కలుపు మొక్కలను ఎప్పటికప్పుడు గుర్తించి పెకిలించి పారేస్తే సరి. నగర సేద్యానికి ప్రధాన అడ్డంకివే. ఉన్న కాస్త జాగాను కబ్జా చేసే వీటితో చాలా జాగ్రత్తగా ఉండాలి. పురుగు పట్టినా వెంటనే క్రిమిసంహారాలు వాడేయకుండా ఇతర పరిష్కారాలు ఆలోచించాలి. ఇప్పుడు బోలెడన్ని ఆన్‌లైన్ వేదికలు వెంటనే మీ సమస్యకు పరిష్కారం చెప్పేందుకు అందుబాటులో ఉన్నాయి. ఆర్గానిక్ టెర్రస్ గార్డెన్ (ఓటీజీ)లాంటి ఎన్నో వేదికలు వెంటనే స్పందించి మీకు వివరాల్ని అందజేస్తాయి కూడా. మీ ఊరిలో ఎవరైనా ఇలాంటి పట్టణ రైతులుంటే ఎప్పటికప్పుడు వాళ్లతో టచ్‌లో ఉంటే చిట్కాలు ఇట్టే ఇచ్చిపుచ్చుకోవచ్చు. ఇంటి పంటను ఇప్పుడిప్పుడే మొలకెత్తించేవారైతే తొలుత టమోటాలు, పచ్చిమిర్చి, వంకాయలు, చిక్కుళ్ల లాంటి వాటితో ప్రయత్నిస్తే మంచిది. ఇవైతే బాగా పెరటి పంటకు నప్పుతాయి. వర్మీ కంపోస్ట్ వల్ల చాలా మేలు కలుగుతుంది. మట్టి అవసరమే లేని హైడ్రాపోనిక్స్‌ను కూడా ప్రయత్నించవచ్చు. అయితే భవంతి చెమ్మగిల్లే అవకాశం లేకుండా వాటర్ ప్రూఫింగ్ చేసుకోవడం మంచిది. కొన్ని విధానాల్లో ఆ అవసరం కూడా రాదు. టార్పాలిన్, పాలీథిన్ పట్టాలను అడ్డుగా వేయడం వల్ల నీరు భవంతిలోకి ఇంకే అవకాశం ఉండదు.



బెంగళూరు కిచెన్ గార్డెన్స్

బెంగళూరుకు గార్డెన్ సిటీ అనే పేరు కబ్బన్ పార్కు వల్లో, లాల్ బాగ్ వల్లో రాలేదంటారు నారాయణ్ విశ్వనాథ్. ఆర్గానిక్ టెర్రస్ గార్డెనింగ్‌లో బాగా పేరొందిన ఆయన గార్డెన్ సిటీ ఫార్మర్స్ అనే సంఘానికి అధ్యక్షుడిగా తోటి నగర రైతులతో కలిసి ఓ ఉద్యమంగా అర్బన్ ఫార్మింగ్‌ను ముందుకు తీసుకెళుతున్నారు. 'ఊట ఫ్రమ్ యువర్ తోట' పేరిట ఏటా నాలుగు సార్లు కార్యక్రమాలు

టవర్ తోట

టెర్రస్‌లు లేని వారికి బాల్కనీ ఉన్నా చాలు కాయగూరలు పండించడానికి అని చెబుతున్న టవర్ గార్డెనింగ్ ఇలా ఉంటుంది. ఓ మెటల్ మెష్‌లో నార సంచులతో ఐదు అడుగుల స్థూపాకార నిర్మాణాన్ని తయారుచేసుకోవాలి. సంచికి 18 ఓపెనింగ్స్‌ను పెట్టుకోవాలి. దానిలో చెరకు పిప్పి, ఆవు పేడను తలో పాతిక శాతం మేర మట్టితో కలిపి నింపాలి. కింది భాగాన్ని ప్లాస్టిక్ బాండ్‌తో సీల్ చేసుకోవాలి. సంచికి 40 నుంచి 60 వరకు రంధ్రాలు పెట్టి ప్లాస్టిక్ గొట్టంతో నీరు పట్టాలి. 25 చదరపు అడుగుల స్థలముంటే చాలు ఈ టవర్‌ను పెట్టేసుకోవచ్చు.

రూపొందించి అర్బన్ గార్డెనింగ్ ప్రదర్శన నిర్వహిస్తుంటారు. నగర సేద్యంపై ఏ అనుమానాన్నైనా అక్కడే నివృత్తి చేసి మరికొందరు పట్టణ రైతులకు విత్తనాల్ని చేయందిస్తున్నారు. ఇప్పటి వరకు 8000 మందికి పైగా శిక్షణనిచ్చిన ఆయన 1995 నుంచి నగర సేద్యంలో ఉన్నారు. సామాజిక మాధ్యమాలను కూడా నగర సేద్య ఉద్యమంలో ఉపయోగించుకుని సందేహాలు నివృత్తి చేస్తుంటారు. కొత్త పద్ధతులపై సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందిస్తుంటారు. మంచి విషయమేమిటంటే ఈయన కార్యక్రమాలకు ఎక్కువగా యువతే వస్తున్నారు. కొత్త జంటలు తమ సంసారాన్ని పచ్చగా కళకళలాడించేందుకు కిచెన్ గార్డెన్‌తోనే కొత్త కాపురాన్ని మొదలెడుతున్నారు. బెంగళూరులో ఈ మధ్య లావణ్య గొరేడియా ఇంటి టెర్రస్ గురించే ఎక్కువగా మాట్లాడుకుంటున్నారు. సుమారు 35 రకాల కాయగూరలు, పండ్ల మొక్కల్ని పెంచుతూ అందర్నీ ఆలోచనలో పడేస్తోందామె. బరోడాకు చెందిన లావణ్య ఆర్కిటెక్ట్. వంటకాలపై ఆమెకున్న మక్కువే తనకు అప్పటికప్పుడు అందేలా రకరకాల కాయగూరలు ఇంటిలో ఎప్పటికప్పుడు తాజాగా సిద్ధంగా ఉంటే బాగుండనిపించింది. బెంగళూరులో ఈ మధ్య బాగా పెరిగిన ఆర్గానిక్ ఉత్పత్తుల ప్రభావం కూడా పనిచేసింది. అలా ఆమె టెర్రస్‌లో అంగుళం భూమిని కూడా వదలకుండా కిచెన్ గార్డెన్‌కు అనుకూలంగా మార్చుకుంది. ఈమే కాదు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఇలాంటి వారెందరో ఆగస్ట్ 25న తమ కిచెన్ గార్డెన్ ప్రత్యేకతను ఓ దినోత్సవంగానూ జరుపుకుంటున్నారు.

ట్యూషన్లు కూడా

లావణ్యే కాదు మరికొందరు కిచెన్ గార్డెనర్లు ఇష్టపడే 'గీక్ గార్డెనర్' అనే బ్లాగ్‌లో కిచెన్ గార్డెనింగ్‌కు సంబంధించిన బోలెడు విషయాలు తెలుసుకోవచ్చు. మట్టి మార్చడం దగ్గర నుంచి విత్తనాటి ఫలం పొందే వరకు ప్రతిదీ స్టెప్ బై స్టెప్ చిత్రాలతోను వివరిస్తూ కొత్తవారికి కాయగూరల పెంపకం తేలిక చేసే ట్యుటోరియల్స్ ఉంటాయిందులో. బెంగళూరుకు చెందిన యువ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ మణి కంఠన్ ఈ బ్లాగ్‌దారుడు. ఉద్యోగానికి బైబై చెప్పి ఇప్పుడు పూర్తిగా నగర



సేద్యానికే అంకితమైపోయాడు. కుండీల్లో, డ్రమ్ముల్లో కాయగూరలు పండిస్తూ తనకు బాగా పనికొచ్చిన కిటుకుల్ని బ్లాగ్ ద్వారా మిగతా వారికి చేరవేస్తుంటాడు. మణి కంఠన్ బ్లాగ్ పాపులారిటీకి కారణం అతడోసారి ఏకంగా 48 కేజీల కీరదోస దిగుబడిని ఇలా టెర్రస్ పంట ద్వారా అందుకోగలిగాడు. బంధు మిత్రులకు బహుమతిగా ఇచ్చింది పోగా ఇంకా మిగిలిపోతే పక్కనున్న సూపర్ మార్కెట్‌లో అమ్ముకున్నాడు కూడా. ఒక్క మణికంఠనే కాదు చాలామంది కుర్రకారు ఇప్పుడు టెర్రస్‌పై కూరగాయల పెంపకాన్ని హాబీగాను, సీరియస్ గాను చేసేస్తున్నారు. మైసూర్లో కిచెన్ గార్డెన్ల పేరిట అధికమవుతున్న ఇంటి పంట వైపు హార్టీకల్చర్ రూపాంతరం చెందుతోంది. హార్టీకల్చర్ విద్యార్థులు ఎక్కువ మంది దృష్టి సారిస్తున్నారు. వీరిలో పి. నల్మే ఒకరు. తన ఇంటిలో పుట్టగొడుగులు పెంచడం అనువుగా ఉంటుందని గ్రహించిన ఆమె ప్రయోగ శాలను వదిలి ఇంటి పంటపై దృష్టిసారించింది. క్రిమిసంహారాలు, రసాయన ఎరువుల అవసరం లేని ఆరోగ్యదాయకమైన ఆర్గానిక్ ఫార్మింగ్‌ను చేపట్టింది. దీనిపై తోటి విద్యార్థులు, యువతకు అవగాహన కల్పిస్తోంది. అక్కడి కుక్కురహళ్లి హార్టీకల్చర్ శాఖ కూడా కిచెన్ గార్డెన్లపై శిక్షణ శిబిరాల్ని ఏర్పాటుచేసి మరికొందర్ని భాగస్వాముల్ని చేసే పనిలో పడింది. వివిధ పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన తరగతులు నిర్వహించి విద్యార్థుల ద్వారా ఇంటికి కిచెన్ గార్డెన్లను పాకిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లోని స్థలాల్లోను ఈ తోటల పెంపకం చేపట్టి మధ్యాహ్న భోజనానికి ఆ కాయగూరలు ఉపయోగించొచ్చనే ఆలోచన కూడా చేసింది. మైసూరు జిల్లాలోని కొన్ని బళ్లలో ఈ విధంగా అప్పటికే కాయగూరల పెంపకం మొదలైపోయింది.

రోజంతా దృష్టి పెట్టాల్సిన అవసరంలేదు. ఎలాగు ఇంటిలో పెంచుకుంటారు కాబట్టి కుటుంబ సభ్యులంతా తలో బాధ్యత పంచుకుంటే సరి. ఇక్కడ మీకో విషయం చెప్పాలి. మొక్కల పెంపకం వల్ల ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. పచ్చదనం మనసుకు ఆహ్లాదాన్ని కలిగిస్తే, స్వచ్ఛమైన గాలి ఆరోగ్యాన్నందిస్తుంది. ఉదయం, సాయం వేళల్లో మొక్కల మధ్యగా తిరుగాడుతుంటే ఉల్లాసంగా ఉండటంతో పాటు మనసు ప్రశాంతతను పొందుతుంది. ప్రతి ఇంట ఇలా నగర సేద్యం సాధ్యమైతే నగర కాలుష్యం నుంచి ప్రపంచాన్ని కుదిపేస్తున్న గ్లోబల్ వార్మింగ్ వంటి సమస్యలకు కూడా కాస్తోకూస్తో పరిష్కారం చూపొచ్చు. నగర సేద్యమంతా కాయగూరల్నే లక్ష్యం చేసుకోవడానికి కారణం పూల కుండీలు, బొన్సాయ్ చెట్లను అలంకరణలను గానూ ఇంటి మధ్యలోకే తెచ్చేస్తున్నారు. ఆహ్లాదం వరకే అవి పరిమితమైతే కాయగూరలు పొట్ట నింపుతాయి కూడా. అందుకే చాలా వరకు నగర సేద్యంలో కాయగూరల పెంపకాన్నే ప్రోత్సహిస్తున్నారు. చెరుకు గడల్ని, స్ట్రా బెర్రీల్ని, ద్రాక్ష గుత్తుల్ని కూడా మేడపై సాధ్యం చేస్తున్న ఔత్సాహికులు ఎందరో. ఇవి అందరికీ చేరేలా హార్టీకల్చర్ శాస్త్రవేత్తలు, నగర సేద్య నిపుణులు, పట్టణ రైతులు తదితరులతో కలిసి విశ్వనాథన్ జాతీయ స్థాయిలో సెమినార్లు, ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. వీటికి హైదరాబాద్, చండీగఢ్, ఢిల్లీ, ముంబై, చెన్నై, పుదుచ్చేరి వంటి నగరాల నుంచి పెద్ద మొత్తంలో యువత హాజరవుతున్నారు. భవన నిర్మాణాలను కూడా నగర సేద్యానికి బాగా ఉపయోగపడేలా కొందరు ఆర్కిటెక్ట్లు ప్రయత్నిస్తున్నారు. బ్లూ ప్రింట్ దశలోనే ల్యాండ్‌స్కేప్‌లకు 30 శాతం జాగా అట్టిపెట్టేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొందరు నగర సాగు ఉద్యమకారులు తమ ఉన్నతోద్యోగాలను వదిలి దేశమంతా తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. కొందరు దీన్నో వృత్తిగా చేపట్టి హిత వ్యాపారాల్ని చేస్తున్నారు. ఇప్పుడిప్పుడే బలపడుతున్న ఈ నగర సేద్య ఉద్యమంలో మీరూ మీ ఇంటికి చోటు కల్పిస్తారు కదూ. ✦



లేడీ ఐన్‌స్టీన్!!

ఐన్‌స్టీన్, స్టీఫెన్ హ్యాకింగ్‌లను మించి ఐక్యూ స్థాయి ఉన్న వారి గురించి తరచూ వార్తలు వినిపిస్తుంటాయి. మరయితే వారంతా ఐన్‌స్టీన్ కన్నా గొప్ప వారవుతారా? వారిలా శాస్త్ర ప్రపంచాన్ని భారీ మలుపు తిప్పుతారా? చెప్పలేం కానీ, సబ్రినా గోంజలెజ్ పాస్టెర్స్కి అనే 22 ఏళ్ల అమ్మాయి మాత్రం నేటి తరపు ఐన్‌స్టీన్‌గా సంచలనం సృష్టిస్తోంది. విశ్వాంతరాళంపై మనకున్న జ్ఞానాన్ని సరిచేసేలా గొప్ప సిద్ధాంతాలకు ఆమె కేంద్రం కానుంది. ఈ ఏడాది స్టీఫెన్ హ్యాకింగ్ కృష్ణబిలాలపై కొత్తగా అందించిన పరిశోధన పత్రాల్లో పాస్టెర్స్కి పరిశోధనాంశాల్ని ప్రస్తావించడంతో ఒక్కసారిగా ఆమె శాస్త్ర ప్రపంచపు చూపును తన వైపు తిప్పుకుంది.

విశ్వం పుట్టుక, ఆకారం, నిర్మాణం, వ్యాప్తి, స్థితిపై ఎన్నో సిద్ధాంతాలు, వాదనలు.. అసందిగ్ధత. కొందరు ఒకటే విశ్వం అంటారు. మరికొందరు అనేక విశ్వాల్లో మనదొకటి అంటారు. బిగ్‌బ్యాంగ్ ముందు అంతా శూన్యమనే వారున్నారు. ఏదీ లేకుండా విస్ఫోటనం ఎలా సంభవమని ప్రశ్నించే వారున్నారు. ఇవే కాదు ఈథర్‌కు చెల్లు చీటీ ఇచ్చాక, డార్క్ మేటర్ అనే సరికొత్త పదార్థాన్ని ప్రవేశపెట్టారు. కృష్ణ బిలాలను ఆహ్వానించే లోపు, శ్వేత బిలాల కాన్సెప్టులు సిద్ధమైపోతున్నాయి. కాంతి వేగం అందుకుని మనిషి ప్రయాణించడం కష్టతరమంటే, వర్మ్‌హోల్స్ సిద్ధాంతంతో సుదూరాలకు పక్కదార్లున్నాయని అంటున్నారు. కాలం, రోదసికి సంబంధం చెప్పి భూత, భవిష్యత్తు కాలాలను చూసి రావొచ్చనే దానిపై పరిశోధనలు ఊపందుకున్నాయి. కళాశాల స్థాయిలో భౌతిక శాస్త్ర విద్యార్థుల నిద్ర చెడగొట్టే సాపేక్ష సిద్ధాంతం, గురుత్వాకర్షణ, స్పేస్ టైమ్‌ల స్వభావాలపై ఉండే థియరీల్లో అదే వయసు నాటికి సబ్రినా పాస్టెర్స్కి అందాన్ని చూసింది. వాటిలోని అద్భుతాన్ని ఆరాధిస్తోంది. క్వాంటమ్ గ్రావిటీని మరింత స్పష్టంగా అర్థం చేసుకునేందుకు పరిశోధనలు సాగిస్తోంది. క్వాంటమ్ మెకానిక్స్ ద్వారా గ్రావిటీ ప్రభావాన్ని తేలిగ్గా విశదపరిచేందుకు అధ్యయనం చేస్తోంది. పాస్టెర్స్కి పరిశోధనలు ఇప్పటి వరకు ఆ అంశాల్లో మనకున్న అవగాహనను మార్చేస్తాయని హార్వర్డ్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త బృందాలు, అంతర్జాతీయ శాస్త్ర రంగ వేదికలు అంటున్నాయి. ఇప్పటికే ఆమె పనిని పరిశీలించిన దిగ్గజ శాస్త్రవేత్తలు ఆమె విప్లవాత్మక సిద్ధాంతాల్ని పరిచయం చేయనుందని చెబుతున్నారు. పాస్టెర్స్కి ఎప్పుడైనా తమతో కలిసి పనిచేయొచ్చని నాసా ఎప్పుడో ప్రకటించేసింది. అమెజాన్.కామ్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ ఆమె సేవలకు తమ కంపెనీ ద్వారాలు ఎప్పటికీ తెరుచుకునే ఉంటాయని ఆఫర్ ఇచ్చాడు. అంతరిక్ష వాహనాలు, విమానాల రూపకల్పన, నిర్మాణ సంస్థ బ్లూ ఆరిజిన్ కూడా పాస్టెర్స్కి ఎప్పుడు తమకు పనిచేస్తుందా అని కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తోంది. ప్రస్తుతానికి పూర్తిగా కృష్ణబిలాలు, క్వాంటమ్ ఫిజిక్స్‌కే అంకితమైపోయిన ఆమెకు ఇప్పుడు 22 ఏళ్లు. తనకు కేవలం 14 ఏళ్ల వయసున్నపుడే తన తండ్రి కోసం ఓ విమానాన్ని రూపొందించి బహుమతిగా ఇచ్చేసింది ఈ మేధావి. దాన్ని పరీక్షించి, వాడుకునేందుకు అనుమతి పొందడం కోసం తొలిసారి ప్రఖ్యాత మసాచ్చుసెట్స్ సాంకేతిక విశ్వవిద్యాలయం (ఎంఐటీ) మెట్లు ఎక్కింది. సింగిల్ ఇంజిన్ ఉన్న ఆ విమానం రూపకల్పన, తయారీపై ఓ వీడియోను తీసి యూట్యూబ్‌లో కూడా పెట్టేసింది. తన తండ్రి గ్యారేజీలో 363 రోజులు కష్టపడి సొంతగా తయారుచేసి నడిపింది కూడా. దాన్ని చూసి అవాక్కయిన వారిలో ఎంఐటీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ పెగ్గీ ఉడ్డెన్ ఒకరు. 12 ఏళ్లకే ఎయిర్‌వెంచర్ వద్ద ఎఫ్‌ఏ1కు కోపైలెట్‌గా మారిన పాస్టెర్స్కి ప్రతిభకు ఫిదా అయిపోయిన ఉడ్డెన్ ఆ తర్వాత కొన్నేళ్లకు పాస్టెర్స్కి ఎంఐటీలో సీటు పొందేందుకు సాయం కూడా చేశారు. ఆమె అంచనాలకు తగ్గట్టుగా రాణించి పాస్టెర్స్కి సంస్థలో అవకాశమున్న అత్యధిక స్కోర్ (గ్రేడ్ యావరేజ్ 5.00) సాధించింది. విశ్వవిద్యాలయంలోని మేటి ప్రొఫెసర్ల దృష్టి ఆమె ప్రతిభ మీద పడింది. ఎంఐటీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్నాక మరో ప్రఖ్యాత శాస్త్ర సాంకేతిక బోధనా సంస్థ హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీలో చేరింది. అంతరిక్షం, గురుత్వాల ఆకారాలను వివరించే క్వాంటమ్ గ్రావిటీ ఎస్-మ్యాట్రిక్స్‌కు సంబంధించిన సెమీ క్లాసికల్ విరాసొరో సిమ్మెట్రీ, క్వెడ్ సిమ్మెట్రీపై వచ్చిన లోస్ సబ్లీడింగ్ సాఫ్ట్ సిద్ధాంతాలపై తొలి రెండు పరిశోధనా పత్రాలను వెలువరించి శాస్త్ర ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. అయినా పాస్టెర్స్కి గురించి అంతగా తెలియకపోవడానికి కారణం సామాజిక మాధ్యమాల్లో, మిగతా మీడియాలో ఆమె అంతగా యాక్టివ్‌గా ఉండదు. తనకు ఫేస్‌బుక్, లింక్‌డ్ ఇన్, ఇన్‌స్టాగ్రామ్‌లలో ఖాతాలేదు. కనీసం స్మార్ట్‌ఫోన్ కూడా ఉపయోగించదు. ఫిజిక్స్‌గర్ల్.కామ్ అనే వెబ్‌సైట్ ద్వారానే తాను చేసే పరిశోధనలు, ప్రస్తుత కార్యక్రమాలపై సమాచారం ఇస్తూ ఉంటుంది. క్యూబన్ అమెరికన్ అయిన పాస్టెర్స్కి షికాగో నగర శివారు ప్రాంతంలో పుట్టి పెరిగింది. సుమారు 20 కోట్ల రూపాయలను ఇచ్చే ఫండమెంటల్ ఫిజిక్స్ ప్రైజ్ ఆరంభ బహుమతిని అందుకున్న ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త ప్రిన్స్‌టన్ ప్రొఫెసర్ నీమా అర్కానీ హమేద్ కూడా పాస్టెర్స్కి పరిశోధనల్ని జాగ్రత్తగా గమనిస్తోంది. త్వరలో స్టీఫెన్ హ్యాకింగ్‌తో కలసి పరిశోధనా పత్రాలు సమర్పించనున్న హార్వర్డ్ ప్రొఫెసర్ ఆండ్రూ స్ట్రోమింగర్ ద్వారా పాస్టెర్స్కి ప్రతిభ వెలుగులోకి వచ్చింది. ఆమె పరిశోధనలకు గాను లక్షల రూపాయల్ని ప్రసిద్ధి చెందిన హెర్ట్జ్ ఫౌండేషన్, స్మిత్ ఫౌండేషన్, నేషనల్ సైన్స్ ఫౌండేషన్‌లు అందిస్తున్నాయి. ఫిజిక్స్ అంటే పాస్టెర్స్కికి ఎంత వ్యామోహమంటే మిత్రులు కూడా ఆమెకు సరిగా లేరు. ఉన్న కొద్ది మంది తమ బాయ్‌ఫ్రెండ్స్ గురించి గొప్పగా చెప్పుకుంటుంటే అదేమీ పట్టనట్టు తన ఆలోచనలో తాను ఉంటుందట. భౌతిక శాస్త్ర రంగంలోనే స్థిరపడతావా అని ఎవరైనా అడిగితే అదేమీ 9-5 చేసుకునే ఉద్యోగం కాదు. అలసట వల్ల కాసేపు నిద్ర పోయి లేచాక మళ్లీ దానితోనే మమేకమైపోయే బంధమదని అంటోంది. ఇప్పటి వరకు బోయింగ్ ఫాంటమ్ వర్క్స్‌కు, సెర్న్ లార్జ్ హ్యాడ్రన్ కొల్లైడర్‌లో సీఎంఎస్ ప్రయోగం, నాసా, యూరోపియన్ ఆర్గనైజేషన్ ఫర్ న్యూక్లియర్ రీసెర్చ్ (జెనీవా)కు సేవలు అందించిన ఆమె స్పిన్ మెమరీ, ట్రయాంగిల్ ద్వారా సుపరిచితమైంది. ప్రస్తుతానికి స్ట్రింగ్ థియరీ, హై ఎనర్జీ ఫిజిక్స్‌పై పరిశోధనలు చేస్తోంది. ఫోర్బ్స్, సైంటిఫిక్ అమెరికన్‌లు రూపొందించిన అత్యంత ప్రతిభావంతుల జాబితా (30 అండర్ 30)లో పాస్టెర్స్కి పేరు కూడా ఉంది. రానున్న పదేళ్లలో సైంటిఫిక్ అమెరికన్ మేగజైన్ ముఖ చిత్రం కావాలనేది ఆమె లక్ష్యం.

రేడియో కబుర్లు



రేడియో అనగానే గుగ్లీమో మార్కోనీ పేరు తలచుకుంటారు గానీ, హెర్ట్జ్, నికొలస్ టెస్లా, జగదీష్ చంద్ర బోస్ వంటి కొందరు శాస్త్రవేత్తలు కూడా రేడియో పలుకు వినిపించడంలో కీలక పాత్ర పోషించారు.

సోప్ ఒపేరా అనే మాట రేడియో వాడకంతోనే ప్రచారంలోకి వచ్చింది. టీవీకి ముందు రేడియోది స్వర్ణయుగం. అప్పుడు రేడియోలో వచ్చే నాటికలు, డ్రామా కార్యక్రమాలకు ఎక్కువగా సబ్బు కంపెనీలే ప్రకటనలిచ్చేవి. అలా ఆ ఒపేరాలకు సోప్ ఒపేరా పేరు వచ్చింది.

ఇటాలియన్ అయిన మార్కోనీ 1901 డిసెంబర్‌లో అట్లాంటిక్ సముద్రం మీదుగా ఇంగ్లండ్ నుంచి న్యూఫౌండ్‌ల్యాండ్‌కు రేడియో సందేశాన్ని విజయవంతంగా పంపించి ప్రపంచాన్ని విస్మయపరిచాడు.

ప్రపంచంలో తొలిసారిగా 1920లో పిట్స్‌బర్గ్‌లో కేడీకేఏ కమర్షియల్ రేడియో స్టేషన్ ప్రారంభించారు.

రేడియో వాణిజ్య ప్రకటనలు శ్రోతల్ని ఆకట్టుకోవాలంటే 15 సెకన్లు మాత్రమే నిడివి ఉండాలని తేల్చారు.

క్యూబా విప్లవ వీరుడు చే గువేరా 1959లో పర్యటన సందర్భంగా ఆలిండియా రేడియోలో ఇంటర్వ్యూ ఇచ్చారు.

రేడియోల్ని కార్డ్‌లెస్ ఫోన్లు, సెల్ ఫోన్లు, గ్యారేజీ డోర్ ఓపెనర్లు, శాటిలైట్లు, రాడార్లలోను వాడతారు. యూకేలో 1922-71 మధ్య రేడియో వినాలంటే లైసెన్సు తీసుకోవాల్సిందే.

ఎఫ్ ఎం రేడియో 1939లో పరిచయమైంది.

ఔత్సాహికులు వ్యక్తిగతంగా రూపొందించుకునే హ్యామ్ రేడియో వ్యవస్థ భారత్‌లో 15 వేల మంది వద్ద ఉంటే, అదే జపాన్‌లో 15 లక్షల మంది వాడుతున్నారు.



దేశంలో తొలి ఎఫ్‌ఎం సర్వీస్ 1977 జులై 23న చెన్నై నుంచి ప్రారంభమైంది.

భారత్‌లో రేడియో ప్రసారాల్ని 1923లో రెండు ప్రైవేట్ సంస్థలు తొలిసారిగా ప్రవేశపెట్టాయి. రేడియో క్లబ్ ఆఫ్ బాంబే, కలకత్తా రేడియో క్లబ్‌లే అవి.

అప్పట్లో బీబీసీ సీనియర్ ప్రొడ్యూసర్ అయిన లయోనెల్ ఫీల్డెన్ ఐదేళ్లు భారత్‌లో ఉండి ఆల్ ఇండియా రేడియో (ఎయిర్) వ్యవస్థాపనకు కృషి చేశారు. దేశంలో రేడియో ప్రసారాల తొలి కంట్రోలర్‌గా ఆయన బాధ్యతలు నిర్వర్తించారు.

(ఫిబ్రవరి 13 ప్రపంచ రేడియో దినోత్సవం)



వెండితెర

జల గండ

సముద్రం ఒడ్డున కూర్చుని ప్రశాంతంగా దాని అందాన్ని ఆస్వాదిస్తున్న మనల్ని ఎవరో ఒక మిత్రుడు సినిమా థియేటర్‌కు పరిగెట్టిస్తాడు. తీరా చూస్తే పోస్టర్‌లో అలలు, అల్లకల్లోలం కనిపిస్తుంది. 'వోర్నీ... డబ్బు వొదిలించుకోవడమంటే ఇదే' అనుకుంటాం. సీట్లో సెటిల్ అయ్యాక స్టోరీ కాస్త రన్నయ్యాక గుండెలు గుభేల్ గుభేల్‌మంటాయి. ఇందాక ఒంటరిగా తిరిగొచ్చిన సముద్రంలో ఇంత భయపెట్టే మేటరుందా అనుకుని బిగుసుకుపోతాం. సముద్రం, అందులోని వింత జీవులపై వచ్చిన ఎన్నో ఊహాత్మక చిత్రాల్లో కొన్ని... కొన్ని రోజుల పాటు నీళ్లలో కాళ్లుపెట్టాలంటే ఆలోచించేలా చేస్తాయి. అలా ఏ తరాన్నీ వదలకుండా జనాల్ని జడిపించాయి. ఈ హాలీవుడ్ జలగండాలు.

ఇటీవలే 'హార్ట్ ఆఫ్ ది సీ' చిత్రం విడుదలై భారీ విజయాన్ని అందుకుంది. 1820ల కాలానికి మనల్ని తీసుకువెళ్లే ఆ చిత్రంలో అప్పుడు పెద్ద సాహస కార్యంగా చెప్పుకునే భారీ తిమిలింగాల వేటపై నడిచే కథ కన్నీరొలికిస్తుంది. ఓసారొచ్చిన కన్నీరు తిమిలింగం దాడిలో కకావికలమైపోతున్న ఓడను చూసి... అందులోని మనుషుల బతుకుల్ని చూసి... అయితే మరోసారి వొలికే కన్నీరు హీరో గారి పంతం, ధైర్యసాహసాల్ని చూసి... చివరగా వచ్చే కన్నీరు చాలా అర్థవంతంగా ఉంటుంది. అది ఇక్కడ చెప్పేస్తే ఇక సినిమా ఎందుకు చూడ్డం అని తిట్టుకుంటారు. కథ విషయం పక్కన పెడితే సినిమాలోని చాలా సన్నివేశాలు మనల్ని భయసంభ్రమాలకు గురిచేస్తాయి. ఓడల్ని మించి భారీగా ఉండే ఓ జీవి ఆకారం, అది ఎదురుపడినప్పుడల్లా గుండెలు గడగడలాడిపోతుంటాయి. 'థోర్' బలాఢ్యుడు క్రిస్ హెమ్స్‌వర్త్ హీరోగా నటించిన ఈ చిత్రంలో సీటుపైకి కాళ్లు లాక్కునేంత సస్పెన్స్, థ్రిల్లు కావాల్సినంత దొరుకుతుంది. జీవకారుణ్యాన్ని, పోరాటాన్ని హీరో చేసిన ఈ చిత్రం అప్పుడెప్పుడో వచ్చిన హెర్మన్ మెల్విల్లే 'మోబీ డిక్' నవల అనుభూతిని తప్పక కలిగిస్తుంది. ఈ కథలోని స్పెర్మ్ వేల్ పోరాటం మనుగడ కోసమైతే కేవలం మనుషుల్ని వేటాడం తప్ప వేరే పనిలేన్నట్టు హింసాత్మకంగా నీటిన ఈదులాడతాయి మిగతా కథల్లోని జలచరాలు (రక్కసులు). ఇక్కడ మాత్రం మనిషినే గెలవనిద్దాం. భారీ అక్టోపస్‌లతో 'ఇట్ కేమ్

ఫ్రమ్ బినీత్ ది సీ' (1955) చిత్ర
మొదలైతే చిత్రంగా వచ్చిన 'మోబీ
జోనర్‌కు ప్రత్యేక అభిమానుల్ని
జపాన్ వాళ్ల గాడ్జిల్లా, గమేరాల
తీర ప్రాంతాల్ని కల్లోలం చేసింది.
అంతెత్తున ఉన్న వాటితోనే కాదు
వాటితోను కుర్చీలకు అతుక్కుపో
వచ్చాయి.

జాస్

ఓ బృందానికి చావును పరిచయ
షార్క్. మార్టిన్ బ్రాడీ అనే పోలీస
చాలా పోరాటమే చేస్తుంటాడు.

ంతో ఈ జోనర్‌లో గడగడలు
డిక్ (1956) నవల ఈ
ంచింది. 1960ల్లోనే మొదలైన
ండి కూడా అప్పటి నుంచే మొదలై
కల్పితాలు, ఊహాజనితాలు..
ప్రస్తుతం నీళ్లలో కాచుకుకూర్చున్న
మేలా చేస్తామంటూ కొన్ని చిత్రాలు

1975)

పీటర్ బెంచ్లే నవల 'జాస్' (దవడలు) ఆధారంగా తీసిన ఈ చిత్రానికి అదే పేరు పెట్టారు గానీ ఫిన్ (మొప్పు) అని పెడితే సరిగ్గా సరిపోతుంది. అమిటీ ద్వీపానికి విహారానికి వచ్చిన చేసే ప్రధాన పాత్రధారి ఓ వైట్ ఫీసర్ వారిని కాపాడేందుకు వైపు షార్క్‌ల వేటగాడు హంటర్

క్వింట్ పాత్రతోషార్క్‌కు మనుషులంటే పొసగకపోవడంలో తప్పేంలేదని కాసేపు దాని రైవల్రీలో సాగిపోతాం కూడా. స్పీల్‌బెర్గ్ తీసిన ఈ చిత్రంలో ముందుగా అనుకున్న మెకానికల్ షార్క్ సరిగ్గా పనిచేయకపోవడం సరిపోయింది లేకుంటే ఇంకెంత టెర్రర్ సృష్టించేదో ఆ చిత్రం. కేవలం నీళ్లపై ఫిన్ భాగాన్ని చూపిస్తూ బెంబేలెత్తిస్తాడు. గుండె ఆగినంత ఎఫెక్ట్ రావడానికి సంగీతకారుడు జాన్ విలియమ్స్ తన వంతు సాయం చేశాడు. కొన్నేకొన్ని వాద్య పరికరాలతో సంగీతాన్ని సృజించే ఈ మినిమలిస్ట్ దాంతోనే మ్యాగ్జిమమ్ భయాన్ని ప్రేక్షకుడిలో ఉద్భవింపజేశాడు.

పిరానా 3డి (2010)

ఎప్పుడో 1978లో వచ్చిన పిరానా వర్షన్‌కు ఇది రీమేక్. అలెగ్జాండ్రా ఆజా దర్శకత్వంలో వచ్చిన ఇది జన్యు మార్పిడికి లోనైన ఎప్పటివో ప్రాచీన పిరాన్హాలు ఒక్కసారిగా సముద్రం అంతర్భాగం నుంచి బయటపడి ఇష్టానురాజ్యంగా నీళ్లలో కనిపించిన ప్రతి జీవిని చప్పరించేస్తుంటాయి. సమీపంలోని బీచ్‌ల్లో పండగ చేసుకుంటున్న మనుషుల గుంపుల మీదకు పడి ఐస్‌ఫ్రూట్‌లా జుర్రుమనిపించేస్తుంటాయి. ఇది చాలదు భయం వద్దన్నా వెన్ను నుంచి కిక్ స్టార్ట్ అవ్వడానికి. అయితే రిలాక్సేషన్ కోసం వాడుకున్న చెత్త కంటెంట్ అందరికి జీర్ణం కాదు. ఏవో వీడియోలు తీసే ఓ బృందంతో హీరోగారి ప్రయాణం వంటివి ఫార్వార్డ్ చేసే చాన్స్ ఇవ్వవు. చూడాల్సిన పరిస్థితి లేకుండా బిట్లుగా ఇచ్చున్నా స్కిప్ చేసే వీలుండేది. ఏదేమైనా ఈ తరానికి పెద్ద థ్రిల్ కలిగించిన సినిమాల్లో ఇదొకటి.

డీప్ బ్లూ సీ (1999)

డీప్‌గా భయపెట్టేందుకు వచ్చిన మరో చిత్రమిది. ఈ సై-ఫైలోను షార్క్‌లే విలన్లు. అల్జీమర్స్ వ్యాధి చికిత్సకు పనికి వస్తాయనుకునే మేకో షార్క్‌లతో ప్రయోగాలు చేసే ఓ అంతర్జల ల్యాబ్‌లో కథంతా సాగుతుంది. విషయాల్ని బాగా గుర్తు పెట్టుకోగలిగే ఈ జీవాలు తమను హింసించిన వారిపై పగ తీర్చు కోవడాన్ని కూడా బాగానే గుర్తుపెట్టుకుంటాయి. థ్రిల్లర్ల దర్శకుడు రెన్నీ హర్లిన్ తీసిన ఈ చిత్రం గొప్ప హారర్ థ్రిల్లర్‌గా నిలిచింది. డైలాగులు కూడా చాలా ఆలోచింపజేసే విధంగా ఉంటాయి గానీ షార్క్ సన్నివేశాల భయంతో ఒక్కటీ మింగుడు పడదు.

డీప్ రైజింగ్ (1998)

'ది మమ్మీ'తో అందర్నీ కట్టిపడేసిన స్టీఫెన్ సోమర్స్ చూపు ఎడారి నుంచి కళకళలాడే జలాల మీద పడింది. ఇంకేంటి అక్కడ నుంచి ఓ క్రేకన్ (జల రక్కసి)ని తీసుకొచ్చి జనాల మీదకు వదిలేశాడు. ఈ చిత్రంలో హార్ట్ బీట్ అమాంతంగా రైజ్ అయ్యే సన్నివేశాలు కొన్ని ఉన్నాయి. ఇక్కడా గుప్త నిధుల వేట, సముద్ర దొంగలు అంటూ నానా హంగామా ఉన్నా కూడా కథ మాత్రం ఈ క్రేకన్ చుట్టూతానే తిరుగుతుంది. వీటి ఆకలికి అడ్డూ ఆపు ఉండదు అలాంటి వాటికి మనుషులు మరింత ప్రియంగా కనిపిస్తారు. హాలీవుడ్ సినిమాల్లో ఇలాంటి అసాధారణ జీవాల ఇంట్రడక్షన్లు, వేటాడేపుడు సైలెన్స్‌లు మహా ఉత్కంఠగా ఉంటాయి. అలానే ఈ క్రేకన్ కనిపించీ, కనిపించకుండా, వినిపించి, వినిపించకుండా ఎప్పుడు భయపడాలన్న విషయాన్ని సస్పెన్స్‌లో పడేస్తుంది.

లేక్ ప్లాసిడ్ (1999)



గ్రాఫిక్స్ కంటెంట్ పరంగా అంత ఎక్స్‌ప్లెకేషన్ లేకపోయినా లేక్ ప్లాసిడ్ ప్లాట్ మాత్రం భయపడేందుకు సరిపోతుంది. నీళ్లలో కంటే నేల మీదే భారీ మొసలి స్వైర విహారం ఎక్కువుంటుంది. ఎక్కడా లేనంత సైజులో ఉంటూనే చాలా చురుగ్గా కదిలే ఈ మొసలి ఎప్పుడో రాక్షస బల్లుల కాలంలో ఉన్నాయన్న వాటికి దగ్గరగా ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్టు అనిపిస్తుంది. తీరా చూస్తే అలాంటి మొసలి పిల్లల్ని ఓ ముసలి బామ్మ కావాలని పెంచుతుందంటే షాక్ తింటాం.

ఇవే కాదు బ్లాక్ వాటర్స్ (2007), బిలో (2002), లెవీయథాన్ (1989), ది అబైస్ (1989), ది బిగ్ బ్లూ (1988), ఓర్కా, 20.000 లీగ్స్ అండర్ ది సీ (1999), ఓపెన్ వాటర్ (2003), ఆక్టోపస్, ది హోస్ట్ వంటివి భయపెట్టే సముద్ర థ్రిల్లర్లే!

అనకొండ (1997)

ఇవి ఇక్కడ లేనందుకు సినిమా చూశాక చాలా మంది సంతోషిస్తారు. అంతలా అనకొండలతో గుండెల్ని దడదడలాడిస్తారు. ప్రఖ్యాత పాప్ సింగర్ జెన్నిఫర్ లోపెజ్, ర్యాపర్ ఐస్ క్యూబ్ సాధారణ పాత్రల్లో కనిపించే ఈ చిత్రంలో నటనంతా కూడా జాన్ వాయిట్ పాత్ర దగ్గర పోగుపడుతుంది. అనకొండల వేటగాడైన వాయిట్ వల్లే డాక్యుమెంటరీ చిత్రించేందుకు వచ్చిన బృందం కాస్తా అనకొండల జోన్‌లో పడుతుంది. బీపీ ఉన్నోళ్లు ఓ టాబ్లెట్ షీట్ పట్టుకుని థియేటర్లకు వెళ్లేలా ఉంటాయి సన్నివేశాలు. ముఖ్యంగా వాయిట్‌ను అనకొండ మింగేస్తుందా అన్న సన్నివేశం చిత్రానికే హైలెట్.

ఓ ప్రయాణం మిగిలే ఉంది..!



విజయన్‌కు ఆరేళ్లపుడు... తండ్రి చేయి పట్టుకుని కేరళ చూపించాడు. అరవై ఆరేళ్లు దాటిన విజయన్ ఇపుడు తన భార్యకు ప్రపంచాన్ని చూపిస్తున్నాడు. అదీ ఓ చిన్న టిఫిన్ కొట్టు నడుపుతూ. ఇప్పటి వరకూ 17 దేశాలను చుట్టొచ్చిన విజయన్ మోహన దంపతుల్ని ఇది సాధ్యమేనా అని అడిగితే 'సాధిక్యుమ్... సాధికిమ్... సాధిక్కిమ్' అని బదులిచ్చేపుడు ఆయన గొంతు చాలా గంభీరమౌతుంది. అందులో ప్రతిధ్వనించే ప్రపంచాన్ని చూడాలనే ఆ తీవ్ర కాంక్షే చెబుతుంది విజయన్ జీవిత యాత్ర ఎలా సాధ్యమైందో...

ఎర్నాకుళంలోని బాలాజీ కాఫీ హౌజ్ ఓ చిన్న ఇరుకు గదిలో ఉంటుంది. కానీ, అందులో వస్తువుల్ని చూస్తే దుకాణ యజమాని ఆలోచనలు ఎంత విశాలమో తెలుస్తుంది. గోడకు మూడు గడియారాలు మూడు కాలమానాల్ని చూపిస్తుంటాయి. వడల కింది అరలో ఓ గ్లోబ్.. అటు పక్కనే ఈఫిల్ టవర్ మాతృక.. కొన్ని అట్లాస్‌లు, ట్రావెల్ గైడ్‌లు. ఓ చిన్న విమానం బొమ్మ దారం దిండు పక్కన వేలాడుతుంటుంది. మోహన ఇడ్లీల్ని రేకుల నుంచి తీస్తే, విజయన్ పొట్లం చుట్టి ఇస్తాడు. 20-25 రూపాయలు పెడితే కడుపు నిండిపోతుంది. సరిగ్గా అపుడే విజయన్ మోహన దంపతుల ఆకలి మొదలౌతుంది. అది బొజ్జకు కాదు హృదయానికి.. ఇంకా చెప్పాలంటే పసిగట్టలేని మనసుకు. కొత్త ప్రాంతాలు, కొత్త మనుషులు, కొత్త జీవితాలు, కొత్త అనుభూతులు, కొత్త అనుభవాలు రుచి చూడాలనే ఆకలది. అదే ఓ కొత్త ప్రయాణానికి చిల్లర పోగు చేస్తుంటుంది. ఇదీ ఆ దంపతుల రోజువారీ జీవితం.

ఏం వెనకేసుకున్నారు?

ప్రయాణాలకు 45 ఏళ్లలో లక్షలు ఖర్చయ్యాయి.. ఏం వెనుకేసుకున్నారని.. ఏ స్థలమో, బంగారమో కొనుక్కుంటే ఆస్తి మిగిలేదిగా అని అసూయతో అనే సూటిపోటి మాటలకు విజయన్ జవాబిచ్చేపుడు కాస్త నెమ్మదిస్తాడు. గుండె నిండా గాలి పీల్చి నెమ్మదిగా వదులుతూ... వెలకట్టలేని అనుభవాలు, అనుభూతులు, జ్ఞాపకాలు, జీవితంపై సంపూర్ణ జ్ఞానం, ప్రపంచంపై ఓ అవగాహన అని అంటాడు. ఇవి తప్ప మిగతావేవి చివరికంటా రావని నవ్వేస్తాడు. ఇంకా చెప్పాలంటే అవే తరగని ఆస్తి అని.. దాన్ని దక్కించుకున్నందుకు తామే అత్యంత ఐశ్వర్యవంతులమని గట్టిగా చెబుతాడు. మనతో మాట్లాడుతూనే.. కస్టమర్‌కు వేడి వేడి చాయ్ గ్లాసు చేతికందిస్తాడు. మరి మూడేళ్ల అప్పు మెల్లిగా తీరేది ఆ డబ్బుతోనే. పెనం మీద దోసెను తిప్పి.. మళ్లీ మాట కలుపుతాడు. రోజు మొదలు మనవన్నీ ప్రయాణాలే. ఒక్కో ప్రయాణంలో ఒక్కో అనుభవం. ఇంటి నుంచి బయట అడుగు పెట్టడం ఓ విలువైన ప్రయాణమే, తిరిగి ఇంటికి వెళ్లడమూ ఓ అనుభూతుల ప్రయాణమే.. అంటాడు. 'ఈ ప్రయాణాల్లో ఎన్నో ఇబ్బందులు పడతాం.. అలాగే ఎన్నో గొప్ప ఆనందాలు పొందుతాం. ఈ ప్రయాణాలన్నీ ముగిస్తే మన జీవితం ముగిసినట్టే. లెక్కల్లా వీటితో పరిపూర్ణ యాత్ర చేశామా లేదా అనేదే. మనం పోయాక అన్నీ పోతాయి. మనం ఎంత ప్రయత్నించినా సముద్రపు అలల్ని ఆపలేము. అలాగే జీవితంలోని బాధ్యతలు కూడా. ఒకటి పోతే ఇంకోటి వస్తూనే ఉంటాయి. వీటిని తీర్చడం కోసం డబ్బు సంపాదన ఒక్కటే లక్ష్యమైతే ఏమీ పొందలేం, జీవితాన్ని ఆస్వాదించలేం. మరణించేంత వరకు ఒక్క రోజూ విరామం తీసుకోలేం. మనకున్నది ఒక్కటే జీవితం.. మరో దాన్ని సృష్టించుకోలేం. మిగిలి ఉన్న జీవితంలో కావాల్సినంత సమయం మన ప్రయాణాలకు ఉంది. దాన్ని సద్వినియోగం చేసుకోవడమే నేను చేస్తున్నది. ప్రయాణాల వల్ల ఏం పొందుతామో ఒక్క ప్రయాణిస్తే తప్ప అర్థం కాదు. అది అర్థమయ్యేలా చెప్పలేను...' అని సుదీర్ఘంగా తన జీవిత యాత్ర అనుభవాల్ని, అభిప్రాయాల్ని వివరిస్తాడు. కాస్త తీరిక దొరికాక డైరీల్ని ఓ సారి తిప్పి ఆ దేశానికి, ఆ ప్రాంతానికి చేరిపోతాడు.

మనమేం సాధించాం, ఏమి సాధించాలి అనే లెక్కల్ని పక్కనపెట్టి స్వేచ్ఛగా విహరించాలి. కళ్లున్న అందరూ చూస్తారు కానీ మనసు లగ్నం చేసిన వారే అనుభూతి చెందుతారు. గుండెల్లో పదిలం చేసుకుంటారని మెరిసే కళ్లతో చెబుతాడు. నాలా విదేశాలు చుట్టొచ్చే వాళ్లు చాలా వరకు ధనవంతులే ఉంటారు. వాళ్లు వందల డాలర్లు ఖర్చు చేస్తారు. నేను పది డాలర్లు మారుస్తాను. కానీ, అవే ప్రాంతాలు, అవే విషయాలు, అవే అనుభూతులు.. ఒకే ఎరుకనిస్తాయి.. అని చిరునవ్వు చిందిస్తాడు.

హిమాలయాల్లో మలుపు...

విజయన్‌లో ఇలా ప్రపంచాన్ని చూసి రావాలనే యాత్ర కాంక్షను రగిలించింది ఆయన తండ్రి. విజయన్‌కు ఆరేళ్లపుడు కేరళ సుందర తీరమైన పళనికి తొలి ప్రయాణాన్ని కట్టించాడు. ఆ తర్వాత మధురై. జీవితం-ప్రపంచంపై బలమైన ముద్ర వేశాయా ప్రయాణాలు. చిన్నప్పుడు దగ్గరి ఊర్లు చూసి రావడానికి ఇంట్లోని ధాన్యం గింజల్ని

దొంగిలించి పచారీ కొట్టులో అమ్మి ఆ డబ్బుతో ఊర్లు చుట్టొచ్చేవాడు. విజయన్ ప్రయాణాల కోరిక గమనించిన తండ్రి తనతో పాటు కేరళంతటా తిప్పాడు. తమిళనాడు, కర్నాటక, ఆంధ్ర సీమల్ని చూపించాడు. విజయన్ ఆ సంతోషాన్ని పూర్తిగా ఆస్వాదించక ముందే తండ్రి ఆకస్మిక మరణం ఒంటరిని చేసింది. ఇంటి బాధ్యతలన్నీ మీద పడటంతో ప్రయాణాలకు దూరమయ్యాడు. ఇంతలో వివాహమైంది.

భార్యను ఊరు దాటించాడు...

మోహన అప్పటివరకు ఎర్నాకుళం దాటి ఎప్పుడూ బయటకు అడుగు పెట్టలేదు. ప్రయాణంలోని మాధుర్యాన్ని పంచాలని తొలుత దక్షిణ భారత యాత్ర చేశాడు. ఆమెకు అదంతా ఓ కలగా తోచింది. ఆ స్వప్నం నుంచి తేరుకునే కాలంలో 1988లో విజయన్‌కు హిమాలయాల్లో యాత్ర చేసే అవకాశం వచ్చింది. ఓ డబ్బున్న యాత్రికుడికి వంట మనిషిగా తోడు ప్రయాణం సాగించాడు. ఆ ప్రయాణం మొత్తం జీవిత నడతనే మార్చేసింది. అప్పు చేసో, బ్యాంకు నుంచి రుణం పొందో పెద్ద ప్రయాణాలు కట్టాడు. భార్యకు విశాలమైన ప్రపంచాన్ని కళ్లకు కట్టేందుకు తపించాడు. ఉత్తర భారతదేశం పూర్తయ్యాక మిగిలింది మిగతా ప్రపంచం. దేశం దాటడం విజయన్‌కు కొత్తే. తొలుత ఈజిప్టు, జోర్డాన్‌ల ట్రిప్పు. రుణం తీర్చడానికి ట్రిప్పు తర్వాత మూడేళ్ల పాటు కిస్తీలు కట్టారు. మోహనకు అదో దుస్సాధ్యమైన స్వప్నం, దుస్సాహసమైన పయనం. అలా ఒక్కో దేశం చుట్టి రావడం.. ఆ తర్వాత ఇద్దరూ కష్టపడి మూడేళ్లలో రుణం తీర్చుకోవడం. పది డాలర్లకు మించకుండా ఖర్చుపెట్టడం, వీలైనంత వరకూ సర్దుకుపోయి బతకడం. అయినా కూడా దక్షిణాఫ్రికా పర్యటనలో ఓ సారి ఇబ్బందులు తప్పలేదు. కానీ ఓ పాత పరిచయం వల్ల విమాన టిక్కెట్టుకు, ప్రయాణ ఖర్చులకు డబ్బు సాయం అందింది. కొన్ని రోజుల పాటు అతడింట్లో వసతి లభించింది. మలేసియా, సింగపూర్, ఆస్ట్రేలియా, యూఏఈ, యూకే, ఫ్రాన్స్ ఇలా 16 దేశాలు చుట్టొచ్చారు.

ప్రయాణం కట్టించారు...

గతేడాది అమెరికా స్వప్నాన్ని నెరవేర్చుకున్నారు. అయితే అందుకు కాస్త ఎక్కువే ఇబ్బంది ఎదురైంది. కాస్త ఎక్కువే సాయం అందింది. వయసు పైబడటంతో బ్యాంకు వాళ్లు రుణమివ్వడానికి ఒప్పుకోలేదు. బయట అప్పు పుట్టలేదు. ఇక అమెరికా చూడాలనే భార్య కోరిక తీరుతుందో లేదోనని విజయన్ ఆదుర్దా పడ్డాడు. ఓ మీడియా సంస్థకు ఈ విషయం చేరింది. ఓ కథనం వచ్చింది. హరి మోహనన్ అనే ఇండిపెండెంట్ ఫిల్మ్‌మేకర్‌కు విజయన్ మోహన జీవిత యాత్ర స్ఫూర్తిగా అనిపించింది. వెంటనే వారిని కలిసి ఓ డాక్యుమెంటరీ స్క్రిప్టు సిద్ధం చేసుకున్నారు. ప్రయాణాల్లో విశేషాల కన్నా విజయన్ మోహన దంపతుల యాత్ర ఫిలాసఫీనే ఎక్కువ ఆకర్షించింది. దాన్నే 'ది ఇన్విజిబుల్ వింగ్స్' పేరిట విజయన్ మోహన దంపతులకు ప్రయాణంపై ఉన్న పొయెటిక్.. రొమాంటిక్ ప్రేమను తెరకెక్కిస్తూ ఓ కళాఖండాన్ని చిత్రీకరించారు. ఆ లఘుచిత్రాన్ని వీలైనంత మందికి చేరవేసే ప్రయత్నం చేశారు. వీడియో చూసిన ప్రతి ఒక్కరిని ట్రావెల్ బగ్ కుడుతోంది. ఓ విలువైన కాలానికి ప్రయాణం కడుతోంది. అమితాబ్ బచ్చన్, అనుపమ్ ఖేర్‌లను కూడా కదిలించింది. క్రౌడ్ ఫండింగ్‌తో పాటు అనుపమ్ లాంటి పెద్దలు అమెరికా యానానికి సర్వం సిద్ధం చేస్తే... కాంప్లిమెంటరీ టికెట్లతో విమానయాన సంస్థ ప్రోత్సహించింది.



దూకాక రెక్కలు కట్టు...

అమెరికా యాత్ర నుంచి తిరిగొచ్చాక విజయన్ ఆ సంగతులు చెబుతూ లాస్ ఏంజెల్స్, న్యూయార్క్ సిటీలో మనసు తప్పిపోయిందని చెప్పాడు. మోహనను యూనివర్సల్ స్టుడియోస్ కట్టిపడేసింది. ఇన్ని ప్రయాణాల్లో ఏది అద్భుతమని అడిగితే దేనికదే విలక్షణమైందని బదులిస్తూనే... నైలు నదీ పరీవాహకంలో మరోసారి తచ్చాడాలని ఉందని విజయన్ అంటాడు. 'ఇజ్రాయిల్‌లోని క్రీస్తు విగ్రహం దగ్గర కదల్లేకపోయాను.. కానీ స్విట్జర్లాండ్ నుంచి తిరిగిరాలేకపోయానని మోహన వివరిస్తారు. ఈ దంపతుల సహయాత్రలో 45 ఏళ్లు దొర్లిపోయాక గానీ, మోహనకు ఇదంతా ఎలా చేయగలిగారనే ప్రశ్న మెదిలింది. విజయన్ దగ్గర సమాధానం ఉంది. "తొలుత నువ్వు శిఖరం నుంచి దూకేయ్. కిందకు చేరే దారిలో రెక్కల్ని కట్టుకో..." అనే అమెరికన్ ఫాంటసీ రచయిత రే బ్రాడ్‌బరీ మాటల్ని కాస్త అటు ఇటుగా తన సొంత దృక్కోణంలో చెబుతాడు. 17 దేశాలు చుట్టొచ్చాక.... 60 ఏళ్లు దాటాక... ఇంకా ఒక ప్రయాణం మిగిలే ఉంది. అదే రష్యా. ఏమో చెప్పలేం. రష్యా నుంచి ప్రేమతో వచ్చాక మరో ప్రయాణం మిగిలే ఉంటుందేమో. బలంగా కోరుకుందాం విజయన్ మోహనల యాత్ర కొనసాగుతూనే ఉండాలని.

✦

ట్రాఫిక్ స్టెప్పులు

ఇండోర్‌లోని రద్దీగా ఉండే ఓ రహదారిలో నడిరోడ్డున మూన్‌వాక్ చేస్తూ ఓ ట్రాఫిక్ పోలీసు కనిపిస్తాడు. ట్రాఫిక్‌ను వదిలేసి ఇలా రోడ్డుపై ఇష్టానుసారం డ్యాన్సులేస్తున్నాడేంటని మీరు కోపగించుకోకండి. అతడు ఇలా స్టెప్పులతో ట్రాఫిక్‌ను దారికి తెస్తాడు. అతడి పేరు కున్వార్ రంజీత్ సింగ్. రంజీత్ గొప్ప డ్యాన్సర్.. అందులోను మైకేల్ జాక్సన్ అంటే కాలు కోసుకుంటాడు. మరి రంజీత్ డ్యాన్సర్‌గా కాకుండా ఇలా కాప్ అవతారమెత్తడానికి కారణం అతడి ఇద్దరు మిత్రులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. అప్పుడే రంజీత్ ట్రాఫిక్ పోలీసుగా మారాడు. ఆరేళ్లుగా సేవలు అందిస్తున్న రంజీత్‌ను అక్కడ ఇండోర్ డ్యాన్సింగ్ కాప్‌గా పిలుస్తారు. ఎంత డ్యాన్స్‌లో ఉన్నా చిన్న తప్పిదం లేకుండా విధుల్ని నిర్వర్తించే రంజీత్‌కు ఇప్పటి వరకు 42 అవార్డులు అందాయి. రంజీత్‌ను చూసి మరికొందరు ఇండోర్ యువకులు ట్రాఫిక్ పోలీసులుగా మారుతున్నారు. విధుల్లో చేరగానే ఆయన దగ్గర డ్యాన్స్ మెళుకువల్ని నేర్చుకుని అమలు చేసేస్తున్నారు.



ఫోన్ బూత్‌లో డిస్కో...



బెర్లిన్‌లోని ఫ్రెడెరిక్షెన్-క్ర్యూజ్‌బెర్గ్ ఓ ట్రెండీ ప్లేస్. యూఫోరియాతో ఊగిపోయే యువత అక్కడ రోడ్లపై పార్టీల్లో మునిగి తేలుతుంటారు. అలాంటి చోట ఓ బుల్లి నైట్ క్లబ్ టెలీడిస్కో ఉంది. ఎంతంటే ఓ ఫోన్ బూత్ అంత. ఇద్దరు ముగ్గురు పట్టే ఆ ఆ క్లబ్‌లో పార్టీ చేసుకోవాలంటే ఓ కాయిన్ వేయాలి. లోపలికి వెళ్లాక మీకిష్టమైన పబ్ సాంగ్‌ను టచ్ స్క్రీన్‌లో ఎంచుకుంటే చాలు స్మోక్ ఎఫెక్ట్, స్ట్రోబోస్కోప్, డిస్కో బాల్‌తో సహా అన్ని పబ్ హంగులు అందులో తళతళలాడిపోతాయి. మరీ ఇరుగ్గా ఉండటంతో సెల్ఫీలు తీసుకునే చాన్స్ లేదు ఈ టెలీ డిస్కోలో. కానీ మీరు చేసే అల్లరతంటినీ అదే ఫోటోలు, వీడియోలు తీసి మీకు బహుమతిగా ఇస్తుంది.

వింత లోకం

పెంగ్విన్ ప్రేమ

రియో డి జెనీరోకు చెందిన ఇటుకల కార్మికుడు యోవో పెరీరా డి సౌజాకు ఓ మంచి మిత్రుడు దొరికాడు. అదో మాగెల్లానిక్ పెంగ్విన్. దక్షిణ అమెరికాలోని పాటాగోనియా ప్రాంతానికి చెందిన ఈ పెంగ్విన్ ఐదేళ్లుగా తన వలస కాలంలో యోవో పెరీరాను కలిసి వెళుతోంది. కేవలం ఆయన్ను కలిసేందుకే తన వలస మార్గాన్ని కూడా మార్చేసుకుంది. వీరి స్నేహం 2011లో మొదలైంది. తన ఇంటి దగ్గరలోని బీచ్‌లో ఆయిల్‌లో పడి ప్రాణాపాయంలోనున్న ఈ పెంగ్విన్‌ను యోవో కాపాడాడు. దానికి జిన్లిన్ అని పేరు పెట్టి దానికి కూడు, గూడు ఏర్పాటు చేశాడు. జిన్లిన్ కోలుకున్నాక దాన్ని దూరంగా సముద్రంలో విడిచి వచ్చాడు. అతడు తిరిగి ఇంటికి చేరుకునే సరికి ఆయన కన్నా ముందుగా ఇంటికి వచ్చేసి ఎదురుచూస్తూండేది జిన్లిన్. తిరిగి యోవో దాన్ని సముద్రంలో ఒదిలి రావడం, మళ్లీ అది ఇంటిని చేరుకోవడం మామూలైపోయింది. ఓ వారం పాటు యోవో వద్ద ఉన్నాక తిరిగి తన గుంపుతో కలిసి వేలాది మైళ్ల వలస మార్గం పడుతుంది. క్రమంగా ఏడాదిలో 8 నెలల పాటు యోవో వద్దే ఉండిపోయింది. కేవలం 4 నెలలు మాత్రమే అతికష్టంగా అతడికి దూరంగా సొంత జాతితో కలియతిరుగుతోంది.

రోబో చేతిసాయం

ఐరన్ మ్యాన్ సినిమా చూశారా. రోబోలో దూరిన మనిషి చేసే విన్యాసాలు అన్నీ ఇన్నీ కావు. అన్నీ కావు కానీ ఓ విన్యాసంతో ఇండోనేషియాకు చెందిన వయాన్ సుతావాన్ కూడా ఐరన్ మ్యాన్ పేరు సంపాదించేశాడు. తన మెదడు సిగ్నల్ ద్వారా పనిచేసే ఓ రోబోటిక్ పరికరం సాయంతో ఎడమచేతిని కదుపుతున్నాడట. ముగ్గురు పిల్లల తండ్రి అయిన వయాన్ ఓ వెల్డర్. కొన్ని నెలల క్రితం బ్రెయిన్ స్ట్రోక్‌తో ఎడమ చేతికి పక్షవాతం వచ్చింది. జీవనాధారం కోల్పోయిన ఈ మెకానికల్ ఇంజినీర్ తన గ్యారేజీలో ఉన్న పరికరాలతోనే స్వయంగా ఓ రోబోటిక్ ఆర్మ్ సపోర్టర్ రూపొందించాడు. అయితే ఇదంతా పెద్ద బూటకమని కొందరు వాదిస్తున్నారు. పక్షవాతం వచ్చినపుడు మెదడులోని ఆ ప్రత్యేక మోటార్ ఫంక్షన్‌ను చేసే కణాలు నష్టపోతారని అలాంటిది అవి ఎలా బ్రెయిన్ వేవ్స్‌ను ఆ పరికరానికి సిగ్నల్ చేస్తాయని ప్రశ్నిస్తున్నారు. మరికొందరేమో ఓ సాధారణ వెల్డర్‌కు ఆ ప్రోగ్రామింగ్ ఎలా అబ్బింది, ఎటువంటి సూపర్ కంప్యూటింగ్ వ్యవస్థను ఆ పరికరంలో వాడుతున్నాడని నిలదీస్తున్నారు. ఏది ఎలా ఉన్నా ఈ పరికరం వల్ల తన చేతితో చక్కగా తిరిగి పనిచేసుకోగలుగుతున్నానని వయాన్ ఆనందిస్తున్నాడు.





భాష్పాంజలి

నింగి నుండి పయనించి
ధరణిపై వెల్లివిరిసి
కృష్ణా తీరాన మెరిసి
సాహిత్యపు నౌకలో
గోదావరి పైన నడిచి
కవిగా ప్రకాశించి
మినీ కవితలను పెంచి
ప్రపంచీకరణలో
మిన్ను మూగబోయిందని
విమర్శించిన మేలిమి
కవులను కనికరించి
సాహిత్యాన్ని సాగదీసిన
సంప్రదాయపు సిరికవి
వూరూరా, వాడ వాడలా
తిరిగి కవిత్వాన్ని కూడబెట్టిన
కారుణ్య మూర్తి అతడు
ఆంధ్రకవుల మధ్య
ఆరాధకుడిగా మెదిలి
అందలాలు అధిష్టించిన
అపురూప మోహనుడు
కవిత్వాన్ని బువ్వగా
కడుపార కతికిన
సంచార కవి అద్దేపల్లి
ఆంధ్రదేశము నందు
ఆతిథ్యముల మరిగి
కృష్ణా తీరాన నెయ్యి
వాసన జోరు నేనెన్నటికీ
మరువనని మరి మరి
చెప్పిన కవి మా దేవుడు
క్షీరాన నానిన కొత్త తీపి
అటుకుల వలె మనసు
మెత్తని వాడు ఆ భావకవి
గాన మాధుర్యముగా
గజల్సు పాడిన శారదా
తనయుడా భగీరథుడు
సాహిత్య సంద్రాన
జలకంబులాడిన
జగమెరిగినవాడు
రామ మోహనుడు
సాహిత్యమనే నీరు
పచ్చని సంద్రమని
జీవ కవి తను వ్రాసి
ధీరుడయ్యెను జగతిన
సాహితీపరులకు
సాహిత్య లోకాలకు
సంపెంగి సౌరభము
అందించి గెలిచిన
అమీర గంధర్వుడు
దివి భువనమునకు
కాంతి పుంజంలా
తాకిన మోహనాచార్యుడు
ఆంధ్రదేశమునందలి
కవులందరి తరపున
వేనకువేలు భాష్పాంజలిలు
వేయి వసంతా వరకు
సమర్పయామీ స్వస్తి
ఎరుగని రీతిన!

- సీతారామాంజనేయులు

ఫోన్: 08654-224726

అంతా వర్ణమయం

సప్తవర్ణాలు సప్తతిగా మారి
దృశ్యమానం చేస్తున్న స్థితి
ఉద్యోగాన్వేషణలో
దరఖాస్తులు యోగ్యతా పత్రాల
సంచిని
నిరుద్యోగం నిరుద్యోగి చంకకు
తగిలిస్తుంది
అరిగిన కాళ్ళు
కరిగిన పాదరక్షల్ని తొడిగి
ప్రవరాఖ్యుడిలా పాద లేపనం పూసి
పైకి లేస్తాయి
సప్తవర్ణాలు అష్టాదశవర్ణాలై
ఎండమావులపై వాలి
ఆఫీసుల ముందు
మెరుస్తూ మురిపిస్తూ ఆహ్వానిస్తాయి
మయసభలో సుయోధనుడి
ఆత్మాభిమానంలా
రంగుల ఎండమావుల్ని చూసి
నిరుద్యోగం భంగపడుతుంది!
ప్రభుత్వం రాల్చిన వాగ్దానాల
ఎండమావులని చిన్నబోతుంది!
అరక దున్నిన గిత్తలు
రెండెడ్ల బండిని లాగుతూ
వాయుదేవుని వాహనాన్ని ఓడిస్తాయి
వాగ్దానాలు షోడశ వర్ణాలుగా
విస్తరించి
కనుల పండుగ చేస్తున్న దృశ్యం
సబ్సిడీ ఎరువులు
నిండుకున్న గోదాముల్ని చూసి
నిరాశ చెందిన దుక్కి
రాబోయే సరుకు కోసం
అత్రి మహామునిలా
దీర్ఘ తపస్సుకు దిగుతుంది !
వాగ్దానం ఆశను రేపుతుంది
ఆశ కర్తవ్యాన్ని నడుపుతుంది
నిద్ర లేచిన చెవులకు ప్రభుత్వం
ఉగాది పర్వదినం పండుగ చేస్తూ
కోకిల గీతాలాపనలు
పాట పాతదే
కోకిల వొంటికి ప్రభుత్వం
ఆకర్షణీయంగా అద్దిన
వరదగుడి వర్ణాలు!
సంక్రాంతి రోజున
పౌష్యలక్ష్మి చెరుకు గడలతో
ఆగమనం
తీపి పాతదే
ప్రభుత్వం చెరుకు గడలకు
అదనంగా పూసిన
చతుర్దశ వర్ణాలు
సప్తవర్ణాలు సప్తతిగా చీలి
దృశ్య మానం చేస్తున్న దుస్థితి!

- అడిగోపుల వెంకటరత్నమ్

సెల్ : 9848 252946



ప్రతిఘటన

శేషారత్నం
9492925291

కాలం మారిపోయిందేమో క్రమక్రమంగా రుతువుల తీరు కూడా మారిపోతోంది. అందుకే శ్రావణం ప్రవేశించినా ఎండలు ఇంకా తగ్గుముఖం పట్టలేదు.

అంతవరకు ప్రచండంగా వెలిగిన భానుడి తాపానికి ఇళ్లల్లో మగ్గిపోయిన చిన్నా పెద్దా పిల్లా మేకా అంతా ఆకాశం వైపు ఆశగా చూస్తూ కలుగుల్లోంచి వస్తున్న ఎలుకల్లా ఇళ్ళ బయటికొస్తున్నారేమో వీధులన్నీ కళకళ్లాడిపోతున్నాయి.

కాసేపు బేరం చేసే వంకతోనయినా ఏసీ రూముల్లో కాలం గడపొచ్చని అమ్మలక్కల ఆలోచన. అయితే 'కొత్తరకం బట్టలు, ఫ్యాషన్లు కళ్లబడితే హ్యాండ్ బ్యాగ్‌లకు చిల్లు పెట్టుకోకుండా ఎలా వెడతారులే' అని దుకాణాలవాళ్ళు, ఎవరి కలల్లో వాళ్లు తేలిపోతున్నారు.

మామూలుగా అయితే తమని చూస్తే మొహం చిట్లించే జనాన్ని హుకుం చెలాయిస్తూ అదుపు చెయ్యడానికి ఇదే సరైన తరుణమని రోడ్ల మీద పోలీసులు పట్టుబడినవాళ్లకు చెలాన్లు రాయడానికి చిన్న బుక్కులతో తెగ హల్‌చెల్ చేస్తున్నారు...

ఓ బ్లాక్ మోటార్ బైక్ హుషారుగా పరిగెడుతూ నాలుగు రోడ్ల జంక్షన్‌ను సమీపిస్తోంది.

దాని మీద కొత్తగా పెళ్లయిన పాతికేళ్ల పరువంలోని జంట స్వేచ్ఛావాయువులు పీలుస్తూ పట్టరాని ఆనందంతో గాలిలో తేలిపోతోంది....

ఆ యువతి మెడలో నల్లపూసల గొలుసును చుట్టుకుని పచ్చని పసుపుతాడు ఆమె చక్కని మెడకు మరిన్ని వన్నెలద్దుతూ అందంగా మెరుస్తోంది. పల్చని జార్జెట్ చీర పమిట జారిపోకుండా భుజం దగ్గర పిన్ను పెట్టుకున్నా ఆమెను పిల్ల తెమ్మెర ఆటపట్టిస్తుంటే ఆ పిల్ల సర్దుకోలేక అవస్థ పడుతోంది.

అంతలోనే భర్త కావాలని చిలిపితనంతో వేసిన బ్రేకుకి తుళ్లిపడి అతన్ని అల్లుకు పోయింది.

ఆ రద్దీ సమయంలో రేసు గుర్రాల్లా రోడ్డు మీద పరిగెడుతూ బడాబాబుల అధునాతనమైన కార్లు ఆ బైక్‌ను దాటుకుంటూ వెళ్లిపోతున్నాయి. అవి స్పీడుగా వెళ్లిపోతుంటే గాలి చేస్తున్న రయ్యిరయ్యి శబ్దాలకు జనం కంగారుపడి అటూ ఇటూ చకచకా అడుగులు వేస్తున్నారు.

ఇదంతా గమనిస్తున్నా ట్రాఫిక్ కానిస్టేబుల్ నిమ్మకు నీరెత్తినట్లే తనపని తను చేసుకు పోతున్నాడు తప్ప వాళ్లను ఆపేందుకు గాని చలాన్ రాసేందుకు గాని ప్రయత్నించ లేదు.

ముందు కార్లన్నీ తనని దాటుకు పోయాయన్న ఆగ్రహంతో వస్తున్నట్టుగా ఓ తెల్లని అల్ట్రా మోడరన్ కారు స్పీడుగా వచ్చి మోటారు బైక్‌ను రాసుకుంటూ పోయింది.

ఒక్కసారిగా బైక్ అదుపు తప్పింది.

అంతవరకు కిలకిల్లాడుతున్న భార్యాభర్తలిద్దరూ చెరోవైపుకి పడిపోయారు...

కింద పడిన యువకుడికి షాకుతో తల దిమ్మెక్కిపోయినట్లైంది స్పృహలోనే ఉన్నా స్పందించలేకపోయాడు.

యువతి ఎడమకాలు నుంచి కారుతున్న రక్తాన్ని చూసుకుంటూ బెదిరిపోయింది.

అంతే... ఒక్క క్షణం అంతా స్తంభించినట్లయింది.

ఎక్కడి జనం అక్కడే ఆగిపోయారు.

బైక్ పడిపోవడం భార్యా భర్తలిద్దరూ చెరోవైపూ పడడం ట్రాఫిక్ కానిస్టేబుల్ ఓరకంట చూసి ఉలిక్కిపడ్డాడు కాని, తనున్నచోట నుంచి అంగుళం కూడా కదల్లేదు.

అందుకూ కారణముంది.

రెండు మూడు సార్లు అత్యుత్సాహంతో ఇలాంటి ఓవర్‌స్పీడ్ కేసులు, తాగి కార్లు నడిపిన కేసులు రాసిన అతగాడు పైవాళ్ల చేత ముక్క చివాట్లు తినాల్సి వచ్చింది. వీర స్పీడులో వెళ్తున్న కుర్రాళ్లు ఏ పోలీసు బాసు కొడుకో, ఏ కలెక్టరుగారి బావమరిదో అయి చావు తప్పి కన్ను లొట్టబోయినట్టయింది అతగాడికి...

'ఎదవ సంత... బండెక్కితే సాలు ఈ కాలం కుర్రనాయాల్లకి పట్ట పగ్గాలుండవు, అయినా ఎవులెలా పోతే నాకెందుకు? సావనీ' అని గొణుక్కుంటూ విరాగిలా డ్యూటీ నిర్వర్తిస్తున్నాడు.

పోలీసులను నిలదీసేందుకు జనానికెలాగూ దమ్ములుండవు కాబట్టి లైసెన్సు మరిచిపోయి భయంభయంగా వాహనాలు నడిపే అర్భక జీవుల్ని ఎంచుకుని పోలీసు జులుం చెలాయిస్తూ ఆత్మ సంతృప్తి పొందుతున్నాడు.

ఇంతలో అనుకోకుండా మోటారు బైక్‌ను రాసుకుంటూ వెళ్లిన కారు ఆమడ దూరంలో ఆగింది.

అందులోంచి ఇద్దరు మదంతో పోతరించిన జెమాజెట్టీల్లాంటి యువకులు కోపంతో హుంకరిస్తూ కిందకి దిగారు.

ఇద్దరూ మందు మత్తులో ఉన్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఒకడు తూగుతూ ఊగుతూ వచ్చి కిందపడిన యువకుడిని బూతులు తిడుతూ...'ఏం బే... ఎనక పోరిని ఎక్కించుకోగానే కళ్లు కనబడ్డంలేదేంటి బే' అని ఓ బూతు మాట వదిలాడు.

రెండోవాడు కళ్లెగరేసి 'ఏం బే...మేం ఎవరో?

తెలుసా? తెలీకపోతే ఆ కానిస్టేబుల్‌నడుగు...' అంటూ డబ్బులెక్కెట్టుకుంటున్న పోలీసువాడిని చూపెట్టాడు.

అంతేకాకుండా ఇద్దరూ పడిపోయిన యువతి వంక వెటకారంగా చూసి బూతుమాట అని... తూగుతూ కారెక్కబోయారు.

ఆ యువతి అక్కడున్న జనం వంక దీనంగా చూసింది... ఏ ఒక్కరయినా వాళ్లిద్దరినీ పట్టుకుని చితక తన్ని తనను భర్తను ఆసుపత్రికి తీసికెళ్తారేమోనని...

రోడ్డు మీద వాహనాల్లో పోతున్న కొంతమంది వాళ్ల వంక చూసి పెదవి దాటని సానుభూతితో 'అయ్యోపాపం' అని కదిలిపోయారు.

ఒకాయన ముందుకు కదలబోతుంటే 'మీకేమన్నా మతిబోయిందా ఏంటి? చూస్తే అర్థంకావడం లేదూ? అసలే వాళ్లు ఇక్కడివాళ్లలా లేరు. కందకు లేని దురద కత్తిపీటకెందుకు?' అని ఆయన సతీమణే చెయ్యి పట్టి ఆపేసింది.

మరో ఇల్లాలు అందుకుంది.

'ఆ మధ్యన ఏం జరిగిందో పేపర్లో

చదవలేదూ... పడినవాళ్లు గుద్దినవాళ్లు సెటిల్మెంటు చేసుకుని బాగానే ఉన్నారు గాని మధ్యలో తల దూర్చిన పెద్ద మనిషి కత్తిపోట్లు తిని పోలీసు స్టేషను, కోర్టుల చుట్టూ తిరగలేక ఆత్మహత్య చేసుకున్నాడు... ఎందుకిక్కడ? పదండి పోదాం' అంది.

జనం గుసగుసలు కింద పడిపోయిన భార్యాభర్తలిద్దరికీ వినిపిస్తూనే ఉన్నాయి.

అదే జంక్షన్లో ఓ పాన్‌షాపు ఓనరు ఓబులేసుకి మాత్రం ఇదంతా చూస్తూంటే తన రొట్టె విరిగి నేతిలో పడ్డట్టనిపించింది.

ఎందుకంటే ఈ మధ్యనే ఓ టీవీ చానల్ వాళ్లు చిత్రమైన పోటీ పెట్టారు. తాము చూసిన యాక్సిడెంటునో ముఖ్యమైన సంఘటనలనో సెల్ ఫోన్‌లో చిత్రించి చానల్‌కి పంపిస్తే తృణమో పణమో ముట్ట చెప్పడంతోబాటు ఆ రోజు జరిగిన సంఘటనల వీడియోలలో ఆసక్తి రేకెత్తించే ఒక దానికి పదివేల బహుమతి కూడా ఇస్తామనేది పోటీ సారాంశం.

ఓబులేసుకి బహుమతి అయితే రాలేదుగాని జంక్షన్లో కిళ్లీ కొట్టు అయినందున రోజూ చిన్నా చితకా దెబ్బలాటలు దొమ్మీ సంఘటనలు... సెల్‌లో రికార్డు చేస్తూనే ఉన్నాడు. ఈ మధ్యనే ఒకటి టెలికాస్టు అయి కొంచెం మొత్తం కూడా లభించిందతనికి. అంతకంటె గొప్పగా అతని పేరు టివిలో కనిపించేసరికి రెట్టించిన ఉత్సాహంతో సెల్ ఫోనులో వీడియో తీయడంలో మునిగిపోయాడు.

అది గమనించిన మరి కొందరు ఉత్సాహంగా తమ సెల్ ఫోన్లకీ పని చెప్పారు... తమను గుద్దిన కారులోని యువకులు సారీ చెప్పాల్సింది పోయి తన భార్యను చూసి వెటకారపు నవ్వుతో బూతులు కూడా మాట్లాడేసరికి తట్టుకోలేకపోయాడు భర్త.

అంతే ఎక్కడలేని కోపంతో

కారు వైపు దూకుడుగా పరిగెత్తి కారెక్కబోతున్న బీహారీ యువకులను చెయ్యి పట్టి బయటికి లాగాడు. తమ భారీ శరీరాలను చూసైనా వెనక్కి తగ్గని అతని తెగింపుకి నివ్వెరపోయారు. రాంగ్ సైడులో వచ్చి తామే కారుతో బైక్‌ను గుద్దినట్టు తమకు స్పష్టంగా తెలిసినా, పడిపోయిన యువకుడు మీదికొచ్చేసరికి వాళ్లిద్దరికీ పౌరుషం పొడుచుకొచ్చింది.

అన్నిటికీ మించి చుట్టూ మూగుతున్న జనాన్ని చూసి అవమానంగా అనిపించింది కాబోలు వాళ్ల కళ్లు ఎరుపెక్కిపోయాయి.

అంతే... 'నువ్వు మమ్మల్ని చెయ్యి పట్టుకు లాగేపాటివాడివా? అని మరింత బండబూతులు తిట్టడం మొదలెట్టారు.

యువకుడు అర్భకంగా ఉన్నాడుగానీ వాళ్ల అసభ్యమైన మాటలు విని తట్టుకోలేక వాళ్ల కాలరు పట్టుకున్నాడు.

కానిస్టేబుల్ తమను పట్టించుకోడని వాళ్లకు అర్థమైపోయింది. అందుకే ఇద్దరూ విజృంభించారు.

ఒకడు కసిగా ఆ బక్క పలచని యువకుడి చొక్కా చింపేశాడు. రెండోవాడు బలంగా ముఖం మీద పిడి గుద్దులు గుద్దుతున్నాడు.

ఆ యువకుని దీనారావాలను జనం భయంకరమైన క్రైమ్ సినిమా చూస్తున్నట్టు ఆసక్తిగా చూస్తుండి పోయారు తప్ప ఒక్కరు కూడా ఆపే ప్రయత్నం చేయలేదు...

అతని భార్య ఇదంతా చూస్తూ రక్షించమని అరుస్తూనే వుంది...

రక్తమోడుతున్న ఆమె కాలు కదలనివ్వడం లేదు.

ఆ యువతి ఏడుపు అక్కడున్న గుండెలను కరిగిస్తున్నా భయం దయను మింగేసింది.

అర్భకుడైన తన భర్త ఆ యువకుల చేతిలో దెబ్బలు తింటుండడం ఆమె మరి సహించలేకపోయింది.

అంతే... ఒక వంక ప్రాణం తోడేస్తున్నా మునిపంట బిగించి ఒక్క ఉదుటున లేచింది. అప్పటిదాకా గుడ్లప్పగించి చూస్తున్న అక్కడున్న వాళ్లంతా నిశ్చేష్టులైపోయారు.

ఒక్క క్షణం ఏం జరుగుతోందో అర్థం చేసుకున్న ఆ యువకులకు మరింత పౌరుషం ముంచుకొచ్చింది.

ఒక ఆడది... పాతికేళ్లయినా లేని అర్భకురాలు తమ మీద చెయ్యి చేసుకోవడమా? ఇంతమంది ముందు తమను కొడుతుందా?

వాళ్లలోని రాక్షసత్వం పురి విప్పింది. వెంటనే ఆమె భర్తను వదిలేసి ఆ యువతి చీర కొంగు పట్టుకుని లాగి బొడ్డు దగ్గర కుచ్చిళ్లను ఒక్క గుంజు గుంజారు. చీర కుచ్చిళ్లు బయటకు వచ్చేశాయి. ఒక్కక్షణం బిత్తరపోయిన ఆ యువతి సిగ్గుతో ముడుచుకుపోయింది.

వాళ్లు అంతటితో ఆగలేదు.

'నిన్నేం చేస్తామో చూడు... రెడ్‌లైట్ ఏరియాకు అమ్మేస్తాం...నీ పొగరు అప్పటికి గాని అణగదు...'

ఆమె జుట్టు పట్టుకుని ఈడ్చడం మొదలెట్టారు.

ఆమె వాళ్లతో పెనుగులాడుతూనే గోళ్లతో అందిన చోటల్లా వాళ్ల శరీరాల మీద గాట్లు పెట్టింది.

వాళ్లలో ఒకడు మరింత విజృంభించి ఆమె లంగా బొందును లాగబోయాడు.

ఆమె తన మానాన్ని కాపాడుకోవడానికి ఒక వంక ప్రయత్నిస్తూనే మరో వంక తన ప్రయత్నాన్ని ఆపకుండా పోరాడుతూనే ఉంది. ఇంత జరుగుతున్నా కానిస్టేబుల్ మాత్రం తన స్థానం నుండి కదల లేదు. అక్కడున్న వాళ్ళూ కళ్లప్పగించేశారు.

ఇంతలో తలవని తలంపుగా ఎక్కడి నుంచో

ఒక పెద్ద కంకర రాయి ఒకటి దూసుకొచ్చి బలిష్ఠమైన యువకులలో ఒకడి ముఖానికి తగిలి 'అబ్బా' అని కూలబడిపోయాడు.

ఆ తర్వాత ఎక్కడి నుంచి వస్తున్నాయో ఆ ఇద్దరు యువకుల మీద అవిరళంగా అలా రాళ్లు పడుతూనే ఉన్నాయి.

జనం అవి విసురుతున్న వాళ్లను చూసి విస్తుపోతున్నారు.

వాళ్లు...

అప్పుడే స్కూలు వదిలి... రోడ్డు దాటడానికి వచ్చిన ప్రాథమిక పాఠశాల విద్యార్థినులు...

నీలిరంగు యూనిఫాంలో ఉన్న తొమ్మిది, పదేళ్ల ఆ పిల్లల ముఖాల్లో అంతులేని క్రోధం, జుగుప్స, కసి....

వాళ్ల చేతుల్లో సాహసానికి ప్రతీకల్లా కంకర రాళ్లు... అక్కడ రోడ్డు వేయడానికి ఇటీవలే వేసిన కంకర గుట్టలోంచి ఒకరికొకరు రాళ్లను అందించుకుంటూ పిల్లలు అలా విసురుతూనే ఉన్నారు....

యువకుల ఆర్తనాదాలు విని ట్రాఫిక్ కానిస్టేబుల్ పరిగెత్తుకొచ్చాడు..

వాళ్ల అవస్థ చూసి తెల్లబోయి అచేతనంగా నిలబడిపోయాడు.

మోటారు బైక్ మీంచి పడిపోయిన యువతి కళ్ల నిండుగా నీళ్లు... అందులో అంతులేని ఆశ్చర్యం...

ఒక పాప ఆ పక్కనే పడి ఉన్న ఆ యువతి చీరను తీసుకొచ్చి అందించింది.

ఆ యువతి ఆ పాపను కౌగిలించుకుని కన్నీళ్లతోనే నిండుగా నవ్వింది.

లేచి నిలబడి కాలు ఈడుస్తూనే ముందుకు అడుగేసింది.

అక్కడ నిలబడి చోద్యం చూస్తున్న జనం ఒక్కసారిగా మిన్ను మారుమ్రోగిపోయేట్టు చప్పట్లు కొట్టారు.

ఆ యువతి అపర చండికలా గర్జించింది...

'ఆపండి...' బిత్తరపోయారు అంతా...

'ఎవడిక్కావాలి మీ చప్పట్లు... మీరసలు మనుషులేనా? మీలో మానవత్వం ఉందా? ఎక్కడి నుంచో వచ్చిన గూండాలు మీ కళ్లెదుట ఒక ఆడకూతురికి అన్యాయం చేస్తుంటే మీరంతా కళ్లప్పగించి సినిమా చూస్తున్నారా? అదే మీ కూతురికో కోడలికో చెల్లెలికో జరుగుతున్నా ఇలాగే చోద్యం చూస్తూ నిలబడతారా? సెల్‌ఫోన్లో ఫోటోలు వీడియోలు తీస్తున్నారా? మీ భార్యే అయినా ఇంతేనా? ఈ బొడ్డూడని చిన్న పిల్లలకున్న ధైర్యం, సాహసం, విచక్షణాజ్ఞానం మీలో లోపించాయా? ఛీ... ఇదిగో పోలీసూ! సిగ్గులేదూ నీకు... వీళ్లకేమయినా అవుతుందేమోనని ఇప్పుడొస్తావా? నీ బతుకు చెడా!' అయితే ఈ మాటలేమీ పైకి అనలేదామె...

వాళ్లలో ప్రతిఒక్కరి వంకా గుచ్చి గుచ్చి చూసిన చూపుల్లో ఆ మాటలు అందరి చెవుల్లో ... ప్రతిధ్వనించాయి...

ఆ యువతి భర్తను నెమ్మదిగా లేవదీసింది. ఇద్దరూ ఒకరి భుజాలను ఒకరు ఆసరాగా పట్టుకున్నారు.

అక్కడ నుంచి వెళ్లిపోతూ ఓ పాప ముందు ఒక్క క్షణం మోకాళ్ల మీద వంగింది.

'రాయి వేసి కొట్టావే.. ఆ రాక్షసులు నిన్ను చంపేస్తారని భయమెయ్యలేదా పాపా....?'

'ఊహూ...వాళ్లు తప్పుచేసినవాళ్లు కనుక భయపడాలి కానీ మేమెందుకు భయపడాలి?'

మరో పాప ముందుకొచ్చి ఆమె చెంపలు తుడిచింది.

'భయపడితేనే భయం వేస్తుందని మా టీచరు చెప్పారక్కా!

ఢిల్లీలో నిర్భయ అక్కయ్య గురించి టీవీలో చూస్తూ మా అమ్మ ఎంతో ఏడ్చింది. మీ అమ్మ కూడా అలా ఏడవకూడదనుకున్నాం. రోడ్డుమీది రాళ్లగుట్టను చూడగానే వీళ్లతో ఎలా పోరాడాలో మాకే అర్థమయింది' అని అమాయకంగా అన్న ఆ పిల్లల మాటలు ఓబులేసుతో సహా వాటిని వింటున్న జనానికి చేతన కలిగించాయేమో... ఒక్కుమ్మడిగా కానిస్టేబుల్ రక్షణలో ఉన్న గూండా యువకులవైపు కసిగా ఉరికారు... ఈ సారి ఎవరి ఆడవాళ్లూ తమ మగవారిని ఆపే ప్రయత్నం చెయ్యలేదు సరికదా వారూ సత్యభామలే అయ్యారు.

ఉరుములతో ఫెళఫెళారావాలతో అక్కడ జడివాన మొదలయింది.

ఆ యువతి మూసిన కళ్ల నుండి బరువెక్కిన ఓ అశ్రుకణం చెక్కిళ్లను దాటుకుని వచ్చి గడ్డం మీదుగా కిందకు రాలింది.

బలవంతమైన సర్పము కూడా స్థానబలం సామూహికబలంతో తనను చుట్టుముట్టే చలిచీమల చేతిలో ఎలా సమసిపోగలదో జాగృతం చేస్తే చాలు, సంకెళ్లు వాటంతట అవే విడిపోతాయి. ఈ రోజు పసివాళ్లు ఆ సాహసం చేశారు. ఈ చైతన్యం ఇలా కొనసాగితే చాలు. అద్భుతాలు జరుగుతాయి'.

✦

ఫన్నీగా..



కథలకు ఆహ్వానం

ప్రజాశక్తి ఆదివారం అనుబంధం స్నేహ కథలకు ఆహ్వానం పలకుతోంది. మంచి కథలను ఎంపిక చేసి ప్రచురిస్తాం. కథ సమకాలీన పరిణామాలు, పరిస్థితుల నేపథ్యంగా వుండాలి. ప్రపంచీకరణ నేపథ్యంలో వివిధ రంగాల్లో చోటు చేసుకున్న, చేసుకుంటున్న విపరిణామాలను కథాంశంగా తీసుకోవచ్చు. ప్రగతిశీల చైతన్యాన్ని, ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే కథలకు ప్రాధాన్యత. మూఢనమ్మకాలు పెంచేవిగా, ఏ సామాజిక తరగతిని ప్రత్యేకంగా నొప్పించేదిగా వుండకూడదు. మాండలికాలు ఉపయోగించినా కథన శైలి అందరికీ బోధ పడేలా వుండాలి. నవ్యత, వైవిధ్యం కలిగిన కథలకు ప్రత్యేక ఆహ్వానం.

నిబంధనలు

కథ నిడివి ప్రింటులో మూడు ఎ4 కాగితాల్లో వుండాలి. చేతిరాతలో అయితే 8 నుంచి 10 కాగితాల్లో వుండాలి. ప్రింటయినా, చేతిరాతైనా కాగితానికి ఒకవైపు మాత్రమే వుండేలా... జిరాక్స్ ప్రతిని పంపాలి. కథలను తిప్పి పంపడం వుండదు. పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నెంబరు తప్పక రాయాలి. మా చిరునామా: స్నేహ, ప్రజాశక్తి దినపత్రిక, హౌస్ నెం. 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.

మెయిల్ అడ్రస్:
snehaweekly.praja@gmail.com

-ఎడిటర్

బ్రెడ్ పుడ్డింగ్

కావాల్సిన పదార్థాలు

బ్రెడ్ స్లైస్‌లు - 6
వెన్న - 1 టేబుల్ స్పూన్
కోడిగుడ్డు - 1
నిమ్మరసం - 1/4 టీ స్పూన్
వెనిలా ఎసెన్స్ - 1/2 టీ స్పూన్
జీడిపప్పుల తరుగు - 2 టేబుల్ స్పూన్లు

తయారుచేసే విధానం

బ్రెడ్ సైడ్స్ తీసేసి వెన్న రాసి పక్కన పెట్టుకోవాలి. కోడిగుడ్డును ఓ బౌల్‌లో వేసి నిమ్మరసం, పంచదార, వెనిల్లా ఎసెన్స్ వేసి బాగా బీట్ చేయాలి. ఈ మిశ్రమాన్ని బ్రెడ్ ముక్కలపై వేసి పైన జీడిపప్పు తరుగు వేసి పైన ఇంకో బ్రెడ్ పీస్‌ను పెట్టి అల్యూమినియం పేపర్‌లో సీల్ చేసి 15 నిమిషాలు బేక్ చేయాలి. చల్లారిన తర్వాత పేపరు తీసేసి తింటే బావుంటాయి.



అటుకుల పులిహోర

కావాల్సిన పదార్థాలు

అటుకులు - 2 కప్పులు
కొబ్బరి పాలు- 1 కప్పు
నిమ్మకాయ - 1
పోపుదినుసులు - తగినన్ని
వేరుసెనగలు -3 చెంచాలు
కరివేపాకు- నాలుగు రెబ్బలు
నూనె- 4 చెంచాలు
పచ్చిమిర్చి - 2
ఎండుమిర్చి - 2
ఉప్పు- తగినంత
ఉల్లిపాయ - 1

తయారుచేసే విధానం

కొబ్బరిపాలలో అటుకుల్ని పది నిమిషాలు నానబెట్టుకోవాలి. బాణలిలో నూనె పోసి పొయ్యి మీద పెట్టాలి. వేడయ్యాక తాలింపు దినుసులు, పచ్చిమిర్చి, కరివేపాకు, వేరుసెనగలు, ఉల్లిపాయ ముక్కలు, ఎండుమిర్చి వేయాలి. అవి మగ్గాక నానిన అటుకులు, తగినంత ఉప్పు చేర్చి కలియతిప్పి దింపేయాలి. వేరే పళ్ళెంలోకి నిమ్మరసం పిండి చల్లారిన అటుకుల మిశ్రమాన్ని వేసి కలుపుకోవాలి. రుచికరమైన అటుకుల పులిహోర రెడీ!

డోక్లా

కావాల్సిన పదార్థాలు

బియ్యప్పిండి -1 కప్పు (బరకగా ఉండాలి)
పచ్చిమిర్చి, అల్లం పేస్టు - 1 టేబుల్ స్పూను
పెరుగు - 1 కప్పు
పంచదార - చిటికెడు
సోడా - 1/4 టీ స్పూను
ఉప్పు- సరిపడా
తాలింపు కోసం
ఆవాలు- 1 టీ స్పూను
కరివేపాకు - 10 రెమ్మలు
ఎండుమిర్చి - 2
నూనె - 1 టేబుల్ స్పూను

తయారుచేసే విధానం

బియ్యప్పిండి పెరుగులో నానబెట్టుకోవాలి. తరువాత అందులో పచ్చిమిర్చి అల్లం పేస్టు, ఉప్పు వేసి నీళ్ళు పోసి కలిపి గాలి తగిలేలా రెండు గంటలు ఉంచాలి. తరువాత ఈ మిశ్రమంలో సోడా కలపాలి.

అంచున్న ప్లేటుకి నెయ్యి రాసి అందులో ఈ మిశ్రమాన్ని వేసి సమంగా సర్ది ఆవిరి మీద పది నిమిషాలు సిమ్‌లోనే ఉడికించి తీసి ముక్కలుగా కోయాలి. తర్వాత బాణలిలో నూనె వేసి ఆవాలు, ఎండు మిర్చి, కరివేపాకు వేసి తాలింపు చేసి ఈ ముక్కల మీద వేయాలి. దీన్ని వేడిగా తింటే రుచిగా ఉంటుంది.

క్యాప్సికం బోండాలు

కావాల్సిన పదార్థాలు

బేబీ క్యాప్సికం- 10, ఆలు- 4, ఉల్లిపాయ తరుగు- 1 కప్పు
అల్లం తరుగు- 1 టీ స్పూను
పచ్చిమిర్చి తరుగు- 1 టీ స్పూను
పుదీనా తరుగు- 1/2 కప్పు, ఉప్పు- తగినంత
శనగపిండి - 1 కప్పు
వాము- 1/2 టీ స్పూను
నూనె - వేయించడానికి సరిపడా
నిమ్మరసం - 1 టేబుల్ స్పూను

తయారుచేసే విధానం



ఆలుని మెత్తగా ఉడికించి తొక్కతీసి మెదిపి పక్కన పెట్టుకోవాలి. మందపాటి కడాయిలో 1 టేబుల్ స్పూను నూనె వేసి ఉల్లి, అల్లం, పచ్చిమిర్చి, పుదీనా తరుగుల్ని వేయించాలి. అందులో మెదిపిన ఆలు, తగినంత ఉప్పు వేసి కలిపి రెండు నిమిషాల తర్వాత దింపేయాలి. చల్లారాక నిమ్మరసం చల్లాలి. శనగపిండిలో వాము, చిటికెడు ఉప్పు వేసి తగినంత నీటితో చిక్కగా కలుపుకోవాలి. క్యాప్సికం తొడిమల్ని లోపలి గింజల్ని తీసేసి అందులో ఆలు మిశ్రమాన్ని పెట్టి శనగపిండి జారులో ముంచి నూనెలో దోరగా వేయించాలి. ఈ బోండాలు టమేటో సాస్‌తో చాలా రుచిగా ఉంటాయి.

పదాలు పూరిద్దాం

ఇక్కడ ఆరు బొమ్మలున్నాయి. వాటి ఇంగ్లిష్ పేర్లలో కొన్ని అక్షరాలు మిస్సయ్యాయి. వాటిని కలిపితే పదం పూర్తవుతుంది. బొమ్మల ఆధారంగా సరైన అక్షరాలను నింపేయండి.



స్టార్‌కి దారేది?





ఆకుల చేప

మీకు బొమ్మలు చేయడం అంటే ఇష్టం కదా! మన ఇంటి దగ్గర దొరికే పచ్చి, ఎండు ఆకులతో ఇలాంటి చేప బొమ్మను మీరూ తయారు చేయండే.

బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్! నేను బాలీవుడ్ స్టార్‌ని. తెలుగులో రాజకుమారుడు, ప్రేమంటే ఇదేరా సినిమాల్లో హీరోయిన్‌ని. ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో చెప్పండి?

జింకని కనిపెట్టండి

ఈ చిత్రంలో కనిపిస్తున్న మంచు వనానికి వెళ్ళి ఓ జింక తప్పిపోయింది. దానికోసం లేడి చాలాసేపటి నుంచి వెతుకుతోంది. ఆ జింక ఎక్కడుందో గుర్తించి లేడికి సాయం చేద్దామా!

జవాబులు: బుజ్జిస్టార్: ప్రీతి జింటా, పదాలు పూరిద్దాం : jug, book, clock, bell, fish, clown

ఎన్నున్నాయి?

ముగ్గురు పిల్లలు సరదాగా చెట్టెక్కి పళ్ళు కోస్తున్నారు. ఈ చెట్టు మీద కొన్ని జంతువులు, పక్షులు, వస్తువులు దాగున్నాయి. వాటిని గుర్తించి సున్నా చుట్టండి.



పెన్ స్టాండ్

పెన్నులు, పెన్సిళ్లు ఎక్కడంటే అక్కడ వేసేస్తుంటారు. తీరా స్కూలుకో, ట్యూషన్‌కో వెళ్లబోయే ముందు కనిపించవు. హడావిడిగా వెతుకులాట మొదలెట్టేస్తుంటారు. అలా కాకుండా మీకు అవసరమైన వెంటనే పెన్నులు, పెన్సిళు ఎదురుగా కనిపించాలంటే ఒక ఐడియా వుంది మా దగ్గర. అదే పెన్‌స్టాండ్. బయట షాపుల్లోనూ అమ్ముతుంటారు. అయితే మీరు స్వయంగా తయారుచేసుకుంటే ఆ మజానే వేరు కదా. అందుకే ఇవాళ మీ ముందుకు పెన్‌స్టాండ్‌తో వచ్చాం.

కావాల్సినవి:

పాత ప్లాస్టిక్ డబ్బా, ఐస్‌క్రీమ్ పుల్లలు, ఫెవికాల్, మీకు నచ్చిన రంగు రిబ్బన్.

చేసే పద్ధతి:

చేద్దామా

ముందుగా ప్లాస్టిక్ డబ్బా మూత తీసేసి శుభ్రం చేసుకోవాలి. తడి పూర్తిగా ఆరిపోయాక... ఒక్కో ఐస్‌క్రీమ్ పుల్లని డబ్బా చుట్టూ అతికించాలి. ఆ తర్వాత మీరు మెచ్చిన రిబ్బన్‌ని డబ్బాకి చుట్టి అందంగా ముడి వేయాలి. అంతే! మీకు కావాల్సిన పెన్‌స్టాండ్ రెడీ. ఇక మీ పెన్నులు, పెన్సిళ్లు ఎక్కడికీ పోవు. అవసరమైన వెంటనే తీసేసుకోవచ్చు.



ఐడియా బావుందా! అయితే చేసేయండి మరి. కావలిస్తే...మీ పెద్ద వాళ్ల సాయం తీసుకోండే.

తేడాలు గుర్తించండి

పిల్లలు ఈ రెండు చిత్రాలు ఒకేలా ఉన్నాయి. ఈ చిత్రంలో కనీసం ఆరు తేడాలు గుర్తించండి



పదవికాసం-1

కూర్పు: టి.డి. ప్రసాద్



ఆధారాలు

అడ్డం

1. భూసేకరణ మరో పద్ధతిలో (5)
4. దరువు వాయిద్యం (3)
6. ఏఎన్నార్ చివరి చిత్రం (2)
7. ధనం (2)
8. విరామ చిహ్నం (2)
10. మంగళ సూత్రం, పుస్తె (2)
11. రమ్మనండి (2)
12. చివరి వరకు ఉండని రంగారావు (2)
13. ఓ సముద్ర జీవి, ముద్ర వేసి మూసి వేయు (2)
14. అర, అర్ధ (2)
16. పిపీలిక (2)
17. పారేసే -- కాగితం (2)
18. ఎలుక నివాసం (3)
19, ఓ జలపుష్పం (3)
20. గుడిసె (2)
21. అడ్డం 6తో ప్రయాణం, తలపు (1)
22. మెచ్చు, సామగ్రి పైన దాచుకునేది (3)
23, స్వప్నం (2)
25. మురళిగానములు - 7,6,3,1 (4)
27. ప్రముఖ చిత్రకారుడు వడ్డాది పాపయ్య పొట్టి సంతకం (2)
28. నిలువు (3)
31. కావలి స్థలం, రక్షకభట నిలయం (2)
32. 'నువ్వు నేను' చిత్రంలో ఉదయ్ కిరణ్ జోడీ (3)
33. పొగ గొట్టం (2)
34. ప్రత్యేకహోదా - 1,2,4,3,5 (5)

నిలువు

1. యుద్ధం (3)
2. మత్స్యం, రాశి (2)
3. ధ్వని, ఓ సినీనటి (3)
4. సోదరుని (3)
5. లక్షని ఇలా కూడా అంటారు (3)
7. గుహవలె తొలిచిన రంధ్రం (3)
9. వరి పండే నేల (3)
10. గాలికి కొట్టుకుపోయే గింజలు (2)
13. దేశం, ప్రదేశం (2)
14. బలం, చేవ (3)
15. మూషికం (3)
16. స్త్రీ ధరించే వస్త్రం (2)
17. ఆకుపచ్చని పక్షులు (4)
18. పుర్రె (4)
19. సగం వరకే కటకట (2)
22. అయ్యో (3)
23. శీర్షాసనం వేసిన తెలుగు ప్లాను (4)
24. తెర (4)
26. చివర్లో మేస్త్రీ కలిపితే సినిమా పేరు (2)
28. కొత్తదా --- (3)
29. అగ్ని (2)
30. తినేది బాగుంటే ఇలా ఉందంటారు (2)
32. అహోరాత్రంలో మొదటి సగం (2)

నవ్వుల్ పువ్వుల్

ఏం చెప్పావ్?

ఆ పేషంటుతో ఏమన్నావ్...? ఆపరేషన్‌కు ముందే పారిపోతున్నాడు.. నర్సుని అడిగాడు డాక్టర్.

"ఆపరేషన్ తర్వాత ఏం చేస్తారు అని అడిగితే బంధువులకి అప్పగిస్తామని చెప్పాను సార్..! అంతే పారిపోతున్నాడు.." కంగారుగా బదులిచ్చింది నర్సు.

క్యాచ్

ఒరేయ్ ఈ మధ్య మా నాన్న గ్రౌండ్‌కెళ్లి క్యాచ్‌లు ఎలా పట్టాలో ప్రాక్టీస్ చేస్తున్నాడు రా! స్నేహితుడితో చెప్పాడు హరి.

'ఎందుకురా' అడిగాడు శివ.

"ఏం లేదురా! ఈ మధ్య మా బామ్మ పాత్రలన్నింటినీ విసిరేస్తోంది. వాటిని క్యాచ్ పట్టుకోవడానికి" అసలు విషయం చెప్పాడు.

అరటిపండు

టీచర్: హరి అరటిపండు ఉపయోగాలేంటి!



హరి: అరటి పండు తింటే ఆరోగ్యం, తొక్క తొక్కితే అనారోగ్యం

టీచర్: ఏం తిక్క తిక్కగా ఉందా!

హరి: పండు తింటే మనకు ఉపయోగం. మరి తొక్క తొక్కితే డాక్టరకి ఉపయోగం... రెండు ఉపయోగాలే కదా టీచర్.

ఎబిసిడిలు

నెల రోజుల నుంచి ఎబిసిడిలు దిద్దుతున్నావ్ ఇంకా రాలేదా? కోపంగా అడిగింది టీచర్.

ఎబిసిడిలు ఎప్పుడో వచ్చేశాయండి.. కానీ 'ఇ' దగ్గర నుండి రావటం లేదు! అన్నాడు స్టూడెంట్ బాధగా..



కాఫీ క్యాట్

ఎవరినైనా అనుకరిస్తే వారిని కాపీ క్యాట్స్ అంటాం. దీనికి భిన్నంగా, కాఫీ తాగడంలో తనదంటూ ఓ స్టయిల్ ఉంటే అప్పుడు కాఫీ క్యాట్స్ గుర్తుకు రావాలి అంటోంది ఎలెనా ఎఫ్రెమోవా. రష్యాకు చెందిన ఈ ఇల్లస్ట్రేటర్ సృజనే కాఫీ క్యాట్స్. తాగే కాఫీని కాస్త పుస్తకంలోకి ఒలికించి వాటి మరకల్లో పిల్లి రూపాన్ని కాఫీ తాగేలోపు తెచ్చేస్తుంది. ఒక్కో ఫ్లేవర్, టేస్టుకు తగ్గట్టు ఒక్కో పిల్లి బొమ్మ రూపాన్ని గీస్తుంది. వాటి రంగు ఆ కాఫీ రుచి, వాసనను చెబుతాయి. పిల్లి బొమ్మను చూసి అది కెపూ్యాచినోనో, అమెరికానోనో, మాచ్ఛియాటోనో చెప్పేయొచ్చు. ఈ కాఫీ మరకల పిల్లులకు ఇంటర్‌నెట్‌లో మాంచి స్పందన వచ్చింది. ఈ సరికొత్త ఐడియా ఎంత క్రేజీ అయ్యిందంటే కాఫీ టేబుళ్లపై ఇక ఈ కాఫీ క్యాట్‌ల మెనూ కార్డులు కూడా వచ్చేస్తాయేమో.

ప్రేమతో...

గులాబీలకు ప్రేమకు వున్న అనుబంధం తెలియనిది కాదు. కవులు, కళాకారులు ఏకతాటిపై నిలబడి మరీ... ప్రేయసిని గులాబీతో పోల్చేశారు ఏనాడో. అందుకే ప్రేమికుల దినోత్సవం దగ్గర పడేకొంది ... గులాబీలకు డిమాండ్ పెరిగిపోతుంటుంది. ఎందుకంటే... గులాబీ దినోత్సవంతోనే (ఫిబ్రవరి 7) వాలెంటైన్ వీక్ ప్రారంభమవుతుంది. ఈ రోజున ప్రేమికులు... ప్రేమించి పెళ్లి చేసుకొన్నవారు... ఒకరికొకరు గులాబీలు ఇచ్చి పుచ్చుకుంటారు. గులాబి రంగును బట్టి సందేశం మారుతుంటుంది. ఎన్ని రంగుల గులాబీలు ఎన్నేసి భావాలను మోసుకొచ్చినా ఏ గులాబి మాత్రం ప్రేమకు చిహ్నం. అందునా మనం ఇస్తున్న గులాబీల సంఖ్య మనసులోని మాటను అవతలి వారికి ఇట్టే చేరవేస్తుందన్నది పుష్పాలంకరణ నిపుణుల మాట. 1 గులాబీ ఇస్తే- తొలి చోపులోనే నిన్ను ప్రేమించాను. 2 గులాబీలు - మనిద్దరి ఆలోచనలూ ఒకటే. 3 గులాబీలు- నేను నిన్ను ప్రేమిస్తున్నాను. 7 గులాబీలు- నీ ప్రేమలో పిచ్చివాణ్ణవుతున్నాను. 9 గులాబీలు- జీవితాంతం ఒకరికొకరు తోడుగా వుందాం. 10 గులాబీలు- నువ్వు నా సొంతం. 12 గులాబీలు- నీకు జీవితాంతం తోడుంటాను. 21 గులాబీలు- నేను నీకు కట్టుబడి వుంటాను. 100 గులాబీలు- నిన్ను ఎన్నటికీ విడిచిపెట్టను. 108 గులాబీలు- నన్ను పెళ్లి చేసుకుంటావా?

అని అర్థమట. సో... బీ కేర్ ఫుల్ !

Check List

Book Number	KNSR02B107	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	No		
Missing Pages	NO		
Prepared By	Mouni	Cutting By	Mouni
Scanned By	Shameera	Pages	29